




భానుడి భగభగ

- తొలిసారిగా 40 డిగ్రీలు దాటిన ఎండ

సూర్యుడు నిప్పులు చెరుగుతున్నాడు. రోజురోజుకూ ఉష్ణోగ్రతలు పెరుగున్నాయి. తొలిసారిగా జిల్లాలో 40 డిగ్రీలు ఎండవేడిమి దాటాయి. అత్యధికంలో పులిచెర్లలో 40.5, నింద్రలో 40.3, అత్యల్పంగా విజయపురంలో 35 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. శ్రీరంగరాజపురం మండలంలో 39.9, నదుంలో 38.8, పలమనేరులో 38.7, పెద్దపంజాణిలో 38.7, బంగారుపాళ్యంలో 38.7, గుడిపాలలో 38.7, గుడుపల్లెలో 38.6, పాలసముద్రమంలో 38.5, నగరిలో 37.8, చౌడేపల్లిలో 37.7, తవణంపల్లెలో 37.7, రొంపిచెర్లలో 37.7, శాంతిపురంలో37.7, యాదమరిలో 37.7, కుప్పంలో 37.6, గంగవరంలో 37.6, కార్వేటినగరంలో 37.5, సోమలలో 37.4, గంగాధరనెల్లూరులో 37.3, పెనుమూరులో 37.3, వెదురుకుప్పంలో 37.1, చిత్తూరులో 36.9, ఐరాలలో 36.6, రామకుప్పంలో 36.1, వి.కోటలో 36.1, బైరెడ్డిపల్లెలో 36.1, పుంగనూరులో 35.8, పూతలపట్టులో 35.5 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

- చిత్తూరు కలెక్టరేట్





వైసీపీకి ఝలక్ ఇస్తున్న

వలంటీర్లు

- అనుమాన భయంతో రాజీనామా చేయాలంటూ ఒత్తిళ్లు
- చిత్తూరులో వైరల్ అవుతున్న వలంటీర్ల ఫోన్ సంభాషణ

ఎన్నికలు దగ్గరపడే కొద్దీ వైసీపీకి వలంటీర్లు కూడా ఎదురు తిరుగుతున్నారు. ఆ పార్టీ తరఫున ప్రచారం చేయడానికి జంకుతున్నారు. మరోవైపు టీడీపీ అధినేత చంద్రబాబు, వలంటీరు వ్యవస్థను రద్దు చేయబోమని, మరింత మెరుగ్గా తీర్చిదిద్దుతామని చెబుతుండడంతో వారు ఏకపక్షంగా వైసీపీకి అంటకాగడానికి ఇష్టపడడం లేదు. ఎన్నికల తర్వాత జగన్‌రెడ్డి ప్రభుత్వం తిరిగి అధికారంలోకి వస్తుందనే నమ్మకం సడలిపోవడంతో తెగించి ప్రచారాలకు దూరంగా ఉంటున్నారు. ఇటువంటి వారిని గుర్తించి వారితో బలవంతంగా రాజీనామాలు చేయించే పనిలో వైసీపీ నేతలు పడ్డారు. 'మేమిచ్చిన కొలువు.. చేస్తే మేము చెప్పిన పనులు చేయండి.. కాదంటే రాజీనామాలు చేసి వెళ్లిపోండి' అని బెదిరిస్తున్నారు. ఆ మధ్య గుడుపల్లె మండలంలో ఒకేసారి 14 మంది వలంటీర్లు రాజీనామా చేయగా, గురువారం గుడిపాల మండలంలో 40 మంది రాజీనామా చేశారు. జిల్లాలో అనేకచోట్ల రాబోయే రోజుల్లో రాజీనామాలు మరిన్ని జరుగుతాయని తెలుస్తోంది. చిత్తూరు నగరంలో ఇద్దరు వలంటీర్ల మధ్య జరిగిన ఫోన్ సంభాషణ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. వైసీపీ నేతల బెదిరింపు తీరును ఈ సంభాషణ వెల్లడిస్తోంది. తమను రాజీనామా చేయమన్నారని, అదీ కార్పొరేటర్ వద్ద రాజీనామా పత్రాలు ఇవ్వాలని ఆదేశించారని, చేయకపోతే మేమే తీసేస్తాం అని బెదిరిస్తున్నారని ఈ సంభాషణలో ఉంది. కొసమెరుపు ఏమిటంటే.. ఆ ఇద్దరూ రాజీనామా చేయరాదని నిర్ణయించుకోవడం. 'ఈ ప్రభుత్వం వస్తే.. అప్పుడు చూసుకుందాంలే. నామినేషన్లు వేసినారంటే తర్వాత మనల్ని ఏం చేయలేరు' అని వలంటీర్లు ఒకరికొకరు ధైర్యం చెప్పుకుని తిరుగుబాటు నిర్ణయం తీసుకోవడం.

- చిత్తూరు, ఆంధ్రజ్యోతి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షన్మోహన్

మీకు ఓటు లేదా?

- నమోదుకు మరో అవకాశం.. 15 వరకు గడువు

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 28: ఇప్పటికీ ఓటర్ల జాబితాలో మీ పేరు లేదా? అయితే నమోదుకు కేంద్ర ఎన్నికల సంఘం మరో అవకాశం ఇచ్చింది. ఏప్రిల్ 15వ తేది వరకు ఫారం 6 అందించేందుకు గడువు ఇచ్చింది. ఓటర్ల జాబితాలో పేరు లేనివారు.. ఇంకా ఓటు నమోదు చేసుకోని 18 ఏళ్లు నిండిన ఓటర్లు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించింది. దీనికి సంబంధించి ఓటు హక్కుపై అవగాహన కల్పించే పోస్టర్లను గురువారం సాయంత్రం కలెక్టరేట్‌లో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షన్మోహన్, జేసీ శ్రీనివాసులు, డీఆర్వో పుల్లయ్య ఆవిష్కరించారు. 18 ఏళ్లు నిండిన యువ ఓటర్లతో పాటు జాబితాలో పేరులేనివాళ్లు నేరుగా లేదా ఆన్‌లైన్ ద్వారా నేషనల్ ఓటర్స్ సర్వీస్ పోర్టల్‌లో ఫారం- 6 ద్వారా ఓటు హక్కును నమోదు చేసుకోవచ్చని కలెక్టరు చెప్పారు. ఇప్పటికే నమోదు చేసుకున్న ఓటర్లు తమ నమోదు స్థితిని కూడా తనిఖీ చేసుకోవచ్చన్నారు. ఫారం - 6 రెండు కాపీలు పూరించి, తగిన ధ్రువపత్రాలతో బీఎల్వోలకు అందించాలన్నారు. ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్లు, అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్లు, బూత్ లెవల్ ఆఫీసర్ల కార్యాలయాల్లోనూ దరఖాస్తులు ఉచితంగా లభిస్తాయన్నారు. ఏదైనా సహాయంకోసం 1950కి కాల్‌చేసి తెలుసుకోవచ్చని సూచించారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని ప్రధాన కూడళ్లలో ఓటు హక్కు ఆవశ్యకతపై పోస్టర్లు, బ్యానర్ల ప్రదర్శన, యువ ఓటర్ల నమోదుకు కళాశాలల్లో ప్రత్యేక రిజిస్ట్రేషన్ క్యాంపుల నిర్వహణ, 2కేరన్, సైకిల్ ర్యాలీ, బైక్ ర్యాలీ, మానవహారాలు, యూత్ వాకథాన్, కరపత్రాల పంపిణీ, షార్ట్ ఫిల్మ్‌ల ద్వారా ఓటర్లకు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఐటీ వింగ్ ఎలక్షన్ ప్రోగ్రామర్ ఉమాపతి, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

పాలసముద్రం మండలం కరితేరుగుంటకు చెందిన చిన్నబ్బరాజు, గంగ, నరసింహులు మందడి చెరకు, వరి సాగుచేశారు. మరో నెలలో పంటలు చేతికి వస్తాయనగా పొలాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు చోరీకి గురయ్యాయి. పోలీసులకు ఫిర్యాదు చేశారు. ట్రాన్స్‌ఫార్మర్ కావాలని విద్యుత్ శాఖ అధికారులకు విన్నవించారు. అదిగో.. ఇదిగో అంటూ నెలలు గడిచిపోయాయి. పంటలు ఎండిపోయాయి.

పెనుమూరు మండలం సీఆర్ కండ్రిగ పరిధిలో ఐదు నెలల్లో ఐదు ట్రాన్స్‌ఫార్మర్లు చోరీకి గురయ్యాయి. బాధిత రైతులు పోలీసులకు ఫిర్యాదు చేసి, ఎఫ్ఐఆర్ కాపీతో రెండు నెలలుగా విద్యుత్ కార్యాలయం చుట్టూ తిరిగినా లాభం లేకపోయింది. ఆయా పొలాల్లో పంటలు పూర్తిగా ఎండిపోయాయి.

విద్యుత్‌శాఖ నిర్లక్ష్యం..

రైతులకు శాపం

- చోరీకి గురైన ట్రాన్స్‌ఫార్మర్లను అమర్చని అధికారులు
- ఎండుతున్న పంటలు



కరితేరుగుంటలో ఎండిన చెరకు - పాలసముద్రం మండలం కరితేరుగుంట గ్రామంలో పగులగొట్టిన ట్రాన్స్‌ఫార్మర్

జిల్లాలో వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్ల చోరీలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ప్రధానంగా తమిళనాడు సరిహద్దులోని పాలసమముద్రం, పెనుమూరు, జీడీనెల్లూరు, చిత్తూరు రూరల్ మండలాల్లో అధిక సంఖ్యలో చోరీలు జరుగుతున్నాయి. గత నెలలోనే పాలసముద్రం మండలం గంగమాంబాపురం, బలిజకండిగ, ఆముదాల పుత్తూరు, బాలకృష్ణాపురం గ్రామాల్లో 10కి పైగా ట్రాన్స్‌ఫార్మర్లను దొంగలు పగులగొట్టి అందులోని రాగి వైరును తీసుకెళ్లారు. అలాగే పెనుమూరు మండలంలో గత నెలలో 5 ట్రాన్స్‌ఫార్మర్లు రాత్రికి రాత్రే చోరీకి గురయ్యాయి. వాటి స్థానంలో కొత్తవి అమర్చాలని రైతులు విద్యుత్ శాఖ అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నా పట్టించుకున్న దాఖలాలు లేవు. జిల్లాలో ట్రాన్స్‌ఫార్మర్ల కోసం మూడు వేలకు పైగా దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయంటే వారి పనితీరు ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

నిబంధనలు ఏం చెబుతున్నాయంటే..

వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతుకు గురైనా, చోరీ జరిగినా 24 గంటల్లో కొత్తవి అమర్చాలి. ఆ ట్రాన్స్‌ఫార్మర్లను స్వయంగా విద్యుత్ శాఖ అధికారులే వారి వాహనం ద్వారా కొత్తవి లేదా మరమ్మతు చేసిన ట్రాన్స్‌ఫార్మర్లను తీసుకొచ్చి ఏర్పాటు చేయాలి. అయితే చిత్తూరు అర్బన్ డివిజన్ విద్యుత్ అధికారులు అవేవీ తమకు వర్తించవన్న ధోరణిలో వ్యవహరిస్తున్నారు. ఫిర్యాదులు వచ్చి నెలలు గడుస్తున్నా అటువైపు కన్నెత్తి చూడకపోవడంతో రైతులకు కన్నీళ్లు తప్పడం లేదు.

- చిత్తూరు రూరల్



స్వర్ణరథంలో ఊరేగుతున్న ఉత్సవర్లు

స్వర్ణ రథంపై వరసిద్ధుడు

ఐరాల(కాణిపాకం)మార్చి 28: కాణిపాకంలో గురువారం రాత్రి స్వర్ణ రథంపై సిద్ధి, బుద్ధి సమేత వరసిద్ధి వినాయక స్వామి ఉత్సవర్లు ఊరేగారు. ఉదయం సంకటహర గణపతి వ్రతాన్ని భక్తులు వైభవంగా నిర్వహించారు. ఆలయ ఆస్థాన మండపంలో ఉదయం, సాయంత్రం రెండు బ్యాచ్‌లుగా జరిగిన ఈ వ్రతంలో వందలాదిగా భక్తులు పాల్గొన్నారు. పౌర్ణమి గడచిన నాలుగవ రోజున ఈ వ్రతాన్ని నిర్వహించడం ఆనవాయితీ. ఉదయం మూల విరాట్‌కు అభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అలంకార మండపంలో సిద్ధి, బుద్ధి సమేత వరసిద్ధి వినాయక స్వామి ఉత్సవ విగ్రహాలను ఉంచి పూజలు నిర్వహించి, సంకటహర గణపతి వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అలాగే రాత్రి ఉత్సవర్లను స్వర్ణ రథంలో ఉంచి ఆలయ మాడవీధుల్లో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ఈవో వెంకటేశు, ఏఈవో విద్యాసాగర్ రెడ్డి, సూపరింటెండెంట్లు కోదండపాణి, వాసు, ఆలయ ఇన్‌స్పెక్టర్లు రమేష్, విఘ్నేష్ తదితరులు పాల్గొన్నారు.



ఆస్థాన మండపంలో సంకటహర గణపతి వ్రతాన్ని నిర్వహిస్తున్న భక్తులు

ట్రేడింగ్ పేరిట మోసం!

- పుంగనూరులో సైబర్ క్రైమ్ సోదాలు
- ఇద్దరిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

పుంగనూరు, మార్చి 28: ట్రేడింగ్ పేరిట చేసిన ఆన్‌లైన్ మోసంపై సైబర్ క్రైమ్ పోలీసులు గురువారం రాత్రి పుంగనూరులో సోదాలు నిర్వహించారు. ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. పుంగనూరు గోకుల్‌వీధిలోని ఓ కాంప్లెక్స్‌లో మదనపల్లె ఎస్వీఆర్ లేఅవుట్‌లోని వెంకటప్ప కుమారుడు కన్నప్పగారి మురళి(29) ఎస్ఎస్ రీసెర్చ్ అనే పేరుతో కార్యాలయాన్ని ప్రారంభించారు. కొందరు అమ్మాయిలను పార్ట్‌టైం ఉద్యోగంలో పెట్టుకుని మురళి, వెంకటేశ్.. వారికి స్టోకెన్ ట్రేడింగ్‌పై ట్రైనింగ్ ఇచ్చారు. డీమ్యాట్ ఖాతాలున్న కస్టమర్ల ఫోన్ నెంబర్లు వాళ్లకు ఇచ్చారు. స్టాక్ మార్కెట్ ట్రేడింగ్‌లో పెట్టుబడులు పెడితే లాభాలు వస్తాయని వారి చేత ఫోన్లు చేయించి నమ్మించడం మొదలుపెట్టారు. ఈ నేపథ్యంలో తెలంగాణకు చెందిన భవానీశంకర్ చైతన్యకు ఫోన్ చేసి ట్రేడింగ్‌లో సులభంగా డబ్బు సంపాదనకు టిప్స్ ఇస్తామని, పెట్టుబడి పెట్టాలని కోరారు. దీంతో ఆయన రూ.46,939 చెల్లించగా దానికి రూ.8,059 లాభం వచ్చినట్లు డబ్బు పంపి నమ్మించారు. ఆ తర్వాత భవానీశంకర్ చైతన్య మరో మూడుమార్లు రూ.62 వేలు ఫోన్‌పే ద్వారా డబ్బు పంపారు. ఫోన్ చేసి తన డబ్బులు ఇవ్వాలని ఎస్ఎస్ రీసెర్చ్ నిర్వాహకులను అడిగారు. దీంతో వాళ్లు ఫోను స్విచ్ ఆఫ్ చేశారు. దీంతో ఆయన సైబరాబాద్‌లోని సైబర్ క్రైం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేశారు. సైబర్ క్రైమ్ ఎస్ఐ పి.శ్రీనివాసులు, వారి సిబ్బంది గురువారం పుంగనూరుకు వచ్చి ఎస్ఎస్ రీసెర్చ్ కార్యాలయంలో సోదాలు నిర్వహించారు. కె.మురళి, వెంకటేశ్‌లను అదుపులోకి తీసుకుని పుంగనూరు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం హైదరాబాద్‌కు వారిని తీసుకెళ్లారు.





పుంగనూరులో సోదాలు నిర్వహిస్తున్న సైబర్‌క్రైం పోలీసులు - పోలీస్‌స్టేషన్‌లో ఉన్న నిందితులు

పంచాయతీలకు 'టోకెన్' కష్టం!

- కేంద్రం నిధులిచ్చినా ఖర్చుచేయలేని పరిస్థితి

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 28: కేంద్రం నిధులిచ్చింది. వీటిని డ్రా చేసి ఖర్చు చేయాలంటే.. పంచాయతీలకు 'టోకెన్' సమస్య వచ్చింది. అందునా.. మూడు రోజుల్లో ఆర్థిక సంవత్సరం ముగియనుంది. ఆలోగా డ్రా చేయకుంటే నిధులు సస్పెన్స్ ఖాతాల్లోకి వెళ్తాయన్న ప్రచారంతో సర్పంచులు ఆందోళన చెందుతున్నారు. కేంద్ర ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘం నిధులను టైడ్, అన్‌టైడ్ పేరిట రెండు విడతలుగా జిల్లాలోని 684 గ్రామపంచాయతీల ఖాతాలకు సుమారు రూ.29.22 కోట్లు జమచేసింది. వీటిని డ్రా చేసుకునేందుకు కొత్తగా టోకన్ (డిజిటల్ సిగ్నేచర్) సిస్టమ్ ఏర్పాటు చేశారు. పంచాయతీ కార్యదర్శి, సర్పంచులకు టోకన్ (డిజిటల్ సిగ్నేచర్) విధానం ఉండడంతో పాటు ఎంపీడీవో కూడా సంతకం చేయాలి. ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో ఎక్కువ కాలం ఉన్న ఎంపీడీవోలు బదిలీ అయి.. వారి స్థానంలో పక్క జిల్లాల నుంచి వచ్చారు. ఈ కొత్త ఎంపీడీవోలకు గత వారం టోకన్ విధానం వచ్చింది. అన్ని గ్రామ పంచాయతీల్లో ఎన్ఐసీ ద్వారా 20వ తేదీ వరకు టోకన్ విధానం ప్రక్రియ అందింది. మండల స్థాయిలో టోకన్ ప్రక్రియ పూర్తయ్యాక జడ్పీ సీఈవో టోకన్ ఇవ్వాలి. కాగా ఇన్‌చార్జి సీఈవో ప్రభాకర్ రెడ్డి స్థానంలో ఇటీవల గ్లోరియా బాధ్యతలు స్వీకరించారు. జడ్పీ పరిధి నుంచి ఇంకా కొన్ని బాధ్యతలను ఇన్‌చార్జి సీఈవో ఈమెకు బదిలీ చేయకపోవడంతో ఇంకా టోకన్ సిస్టం అందలేదు. ఈ కారణంగా గ్రామపంచాయతీల్లో నిధులు డ్రా చేయలేని పరిస్థితి నెలకొంది. ఈ నిధులను నెలాఖరులోగా డ్రా చేయకుంటే ప్రభుత్వ సస్పెన్స్ ఖాతాలోకి మళ్లించేస్తారన్న వదంతులు రావడంతో సర్పంచుల్లో ఆందోళన పెరిగింది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు టోకన్ సమస్యను సరిదిద్ది ఈ నెలాఖరులోగా ఆర్థిక సంఘం నిధులు డ్రా చేసుకోవడానికి అవకాశం కల్పించాలని సర్పంచులు కోరుతున్నారు.

రంజాన్ వేళలు
ఇఫ్తార్ (శుక్రవారం) : సా. 6.30
సహరి (శనివారం) : ఉ. 4.49

ఎంపిక చేసిన బ్యాంకులు 31న పనిచేస్తాయి

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 28: ఎంపిక చేసిన బ్యాంకులు ఈనెల 31న.. ఆదివారమైనా ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3.30 గంటల వరకు పనిచేస్తాయని ఎల్డీఎం హరీష్ గురువారం తెలిపారు. మార్చి 31వ తేది ఆర్థిక సంవత్సరం ముగింపు రోజు కావడంతో ఖాతాదారుల ప్రభుత్వపరమైన అన్ని లావాదేవీల నిర్వహణకోసం బ్యాంకు శాఖలు పనిచేస్తాయన్నారు. ఆరోజు ఎలాంటి ఇతర లావాదేవీలు జరగవని, ఎలక్ట్రానిక్.. ప్రభుత్వ లావాదేవీలు మాత్రమే జరుగుతాయన్నారు. ప్రభుత్వ అకౌంట్లకు సంబంధించి ఏవైనా చెక్కులను క్లియరింగ్ కోసం బ్యాంకుల్లో సమర్పించవచ్చని, ఎలక్ట్రానిక్స్ ఫండ్స్ ట్రాన్స్‌ఫర్ (నెఫ్ట్), రియల్‌టైం గ్రాస్ సెటిల్‌మెంట్ (ఆర్టీజీఎస్) లావాదేవీలు జరుగుతాయన్నారు.

సంస్కృత పరీక్షకు ఏడుగురు గైర్హాజరు

చిత్తూరు (సెంట్రల్), మార్చి 28: టెన్త్ పబ్లిక్ పరీక్షల్లో భాగంగా గురువారం జిల్లాలోని 46 సెంటర్లలో సంస్కృతం పరీక్ష నిర్వహించారు. 2,442 మంది విద్యార్థులకుగాను 2,435 మంది హాజరు కాగా, ఏడుగురు గైర్హాజరైనట్లు డీఈవో దేవరాజు, పరీక్షల సహాయ కమిషనర్ చాముండేశ్వరి తెలిపారు.



రేణిగుంట సమీపంలోని గోదాములో బయటపడ్డ వైసీపీ ప్రచార సామగ్రి

మాటలేనా చేతలేవి సార్లూ?

ఎన్నికల యంత్రాంగం తీరుపై విమర్శలు

రేణిగుంట గోదాముల్లో పార్టీయేతర సామగ్రిపై మౌనం ఎందుకు?

శ్రీకాళహస్తి ఆర్వో వైఫల్యం, జిల్లా అధికారుల చోద్యం

ఎన్నికలపై సమీక్షల్లో అధికారుల మాటలు కోటలు దాటుతున్నాయి... అయితే వారి అడుగులు మాత్రం గడప కూడా దాటడం లేదు. విధి నిర్వహణలో అలక్ష్యం వహిస్తే సహించేది లేదని జిల్లా అధికారులు తరచూ చెబుతున్నా ఆచరణలో మాత్రం దానికి భిన్నంగా వ్యవహరిస్తున్నారు. రేణిగుంట గోదాముల్లో అధికార పార్టీ ప్రచార సామగ్రి బయటపడిన ఉదంతంలో మండల స్థాయి మొదలు జిల్లా అధికారుల దాకా వైఫల్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది.ప్రత్యేకించి శ్రీకాళహస్తి నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి తీరుపై తీవ్రస్థాయిలో విమర్శలు వస్తుండగా జిల్లాస్థాయి అధికారుల బాధ్యతా రాహిత్యం సైతం జనంలో చర్చకు వస్తోంది.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి


గోదాముల్లో దొరికిన రూ. 1.22 కోట్ల తాయిలాలపై చర్యలేవీ?

రేణిగుంటలోని ప్రైవేటు గోదాముల్లో వైసీపీకి చెందిన ప్రచార సామగ్రి భారీగా బయట పడిన సంగతి తెలిసిందే. అయితే దానికి అదనంగా ప్రచారేతర సామగ్రి కూడా పెద్ద ఎత్తున లభ్యమైంది. చీరలు, బొట్టుబిళ్ళలు, టీ షర్టులు, డైరీలు వంటివి ఓటర్లకు పంపిణీ చేసి వారిని ప్రలోభపెట్టడానికి ఉద్దేశించే గోదాముల్లో నిల్వ వుంచినట్టు భావించాల్సి వస్తోంది. వీటిని సీజ్ చేసిన అధికారులు వాటి విలువ రూ.1.22 కోట్లుగా అంచనా వేశారు. అయితే తదుపరి చర్యలు తీసుకోవడంలో మీనమేషాలు లెక్కిస్తున్నారు. ఓటర్లను ప్రలోభపెట్టేందుకు నిల్వ వుంచిన సామగ్రి నిజంగా వైసీపీ కొనుగోలు చేసివుంటే పార్టీపై క్రిమినల్ చర్యలు తీసుకోవాల్సి వుంది. పార్టీ కొనుగోలు చేయని పక్షంలో వాటిని ఎవరు కొనుగోలు చేశారు? ఎక్కడ నుంచీ తెప్పించారు? అనే వివరాలు ఆరా తీసి బాధ్యులపై క్రిమినల్ చర్యలు తీసుకోవాల్సి వుంది. ఆ క్రమంలో గోదాముల యాజమాన్యంపైనా చర్యలు తప్పనిసరి. అయితే ఇప్పటి వరకూ రేణిగుంట మండల అధికారుల నుంచీ శ్రీకాళహస్తి నియోజకవర్గ అధికారుల దాకా, చివరికి జిల్లా అధికారులు కూడా ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. ప్రచార సామగ్రి దొరికితే పార్టీ లెక్కలోకి లేదా అభ్యర్థి లెక్కలోకి వ్యయం నమోదు చేయడం జరుగుతుంది. అదే నగదు, మద్యం నిల్వలు దొరికితే వెంటనే క్రిమినల్ కేసులు నమోదవుతాయి. ఓటర్లను ప్రలోభ పెట్టే కొను గోలు చేసివుంటే ఏయే సంస్థల నుంచీ కొనుగోలు చేశారు? ఎంత మొత్తం చెల్లించారు? ఆ బిల్లులు సామగ్రి పరిమాణానికి సరిపోతున్నాయా లేదా? ఓటర్ల కోసం తెప్పించిన వస్తువులు నిల్వ వుంచడానికి బాధ్యులను గుర్తించారా? గుర్తించి వుంటే ఎవరు? వారిపై ఏ చర్యలు తీసుకుంటున్నారు? అనే అంశాలపై కనీసం జిల్లా అధికారులైనా మీడియా ద్వారా ప్రజలకు తెలియజేసే ప్రయత్నం మూడు రోజులైనా చేయలేదు. ఈ మౌనం, సాగదీతే ప్రతిపక్షాల్లోనూ, ప్రజల్లోనూ అధికార యంత్రాంగం పట్ల అనుమానాలు తలెత్తేందుకు కారణమవుతున్నాయి. ప్రారంభంలోనే అధికారుల తీరు ఇలా వుంటే ఇక నోటిఫికేషన్ వెలువడ్డాక ఎంతమాత్రం సవ్యంగా పనిచేస్తారన్న ప్రశ్న ఆ వర్గాల నుంచీ వినిపిస్తోంది.అధికారులు తక్షణం తమ తీరు మార్చుకోకుంటే ప్రతిపక్షాలు, ప్రజల ఫిర్యాదులతో ఈసీ నుంచీ చర్యలను ఎదుర్కొనే ప్రమాదం కనిపిస్తోంది.

ప్రచార సామగ్రి, తాయిలాల విషయమై నోరు మెదపని అధికారులు

నెలకు రూ. 5వేల గౌరవ వేతనంపై పనిచేసే వలంటీరును తొలగించిన విషయం కూడా గొప్పగా మీడియాకు ప్రకటనలు జారీ చేస్తున్న జిల్లా అధికార యంత్రాంగం రేణిగుంటలో రూ. కోట్ల విలువైన అధికార పార్టీ ప్రచార సామగ్రి, ఓటర్లను ప్రలోభపెట్టే తాయిలాలు దొరికితే నోరు విప్పకపోవడం తీవ్ర విమర్శలకు, సందేహాలకు తావిస్తోంది. గోదాముల్లో తొలుత తనిఖీలు జరిపి వస్తువులను గుర్తించిన ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు గానీ, తర్వాత పరిశీలించిన జీఎస్టీ అధికారులు గానీ ఆ వివరాలేమీ బయట పెట్టలేదు. అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి హోదాలో వున్న రేణిగుంట తహసిల్దారుదీ అదే పరిస్థితి. ఇక రిటర్నింగ్ అధికారైన శ్రీకాళహస్తి ఆర్డీవో గోదాముల వద్ద మీడియాతో మాట్లాడి దొరికిందంతా వైసీపీ ప్రచార సామగ్రేనని చెప్పి చేతులు దులుపుకున్నారు. అక్కడ దొరికిన సామగ్రి వైసీపీయే తాయిలాలు దొరికినా అవే చర్యలు తీసుకోవాల్సి వుంది. గత మంగళవారం గోదాముల్లో ఈ సామగ్రిని గుర్తించగా మూడు రోజులవుతున్నా కనీసం సామగ్రి ఎవరికి సంబంధించిందనే విషయం కూడా అధికారులు గుర్తించలేకపోతున్నారు. గోదాము అద్దెకు తీసుకున్నది ఎవరు? ఎన్నికల తాయిలాలు ఎవరు ఎక్కడి నుంచీ తెప్పించారు? అన్న దానిపై దృష్టి సారించడం లేదు. సీజ్ చేసి ఈసీకి నివేదించామని చెబుతూ చేతులు దులుపుకునే ప్రయత్నం చేస్తున్నారు. గోదాముల్లో ప్రచార సామగ్రి, తాయిలాలు బయట పడితే రెండవ రోజు సాయంత్రం అది కూడా టీడీపీ నేతలు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాక గానీ నియోజకవర్గానికి రిటర్నింగ్ అధికారిగా వ్యవహరిస్తున్న శ్రీకాళహస్తి ఆర్డీవో పరిశీలనకు వెళ్లలేదు. ఆర్వో తీరుపై టీడీపీ నేతలతో పాటు సామాన్య జనం కూడా అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఆర్వోపై ఎన్నికల కమిషన్‌కు కూడా పెద్దఎత్తున ఫిర్యాదులు వెళుతున్నట్టు సమాచారం.

విద్యుదాఘాతంతో మహిళా రైతు మృతి


శాలిని మృతదేహం

గుడిపాల, మార్చి 28: గుడిపాల మండలం 197 రామాపురం పంచాయతీ సింగారపేటలో గురువారం విద్యుదాఘాతంతో మహిళా రైతు మృతిచెందారు. సింగారపేటకు చెందిన లారెన్స్ భార్య శాలిని(46) తమ పొలంలో మోటారు స్విచ్ ఆన్‌చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై తీవ్రంగా గాయిపపడ్డారు. చికిత్స నిమిత్తం ఆమెను వేలూరు సీఎంసీకి తరలించగా, అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ మేరకు ఎస్‌ఐ శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రూ.93 వేల నగదు సీజ్


పట్టుబడిన నగదుతో తనిఖీ అధికారులు

గుడిపాల, మార్చి 28: బిల్లులు లేకుండా తరలిస్తున్న రూ.93 వేల నగదును చెక్‌పోస్టు తనిఖీ అధికారులు సీజ్ చేశారు. వేలూరు నుంచి శ్రీసత్యసాయి జిల్లాకు చెందిన మినీలారీలో డ్రైవర్ ఎలాంటి ఆధారాలు, బిల్లులు లేకుండా రూ.93 వేల నగదు తీసుకొస్తున్నారు. చెక్‌పోస్టు వద్ద తనిఖీ అధికారి గణపతి ఈ నగదును గుర్తించి సీజ్ చేశారు. తనిఖీలో ఏఎస్‌ఐ రాజేంద్రన్, పోలీసులు పాల్గొన్నారు.

జూన్ వరకు ప్రత్యేక రైళ్ల పొడిగింపు

తిరుపతి సెంట్రల్, మార్చి 28 : తిరుపతి-తిరుమల పుణ్యక్షేత్రాలకు పెరుగుతున్న భక్తుల దృష్ట్యా తిరుపతి నుంచి పలు ప్రాంతాలకు నడుపుతున్న ప్రత్యేక రైళ్లను జూన్ నెలాఖరు వరకు పొడిగించిన ట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌ఓ సీహెచ్ రాకేష్ తెలిపారు. ఇందులో తిరుపతి-అకోలా మధ్య నడుస్తున్న (07605-07606)ఎక్స్‌ప్రెస్‌లు, తిరుపతి-పూర్ణ మధ్య నడుస్తున్న (07609-07610) ఎక్స్‌ప్రెస్‌లు, తిరుపతి-సికింద్రాబాద్ మధ్య నడుస్తున్న(07481-07482)ఎక్స్‌ప్రెస్‌లు జూన్ నెలాఖరు వరకు పొడిగించినట్లు వెల్లడించారు. తిరుపతి-సాయినగర్ (షిరిడీ) మధ్య నడుస్తున్న(07637-07638)ఎక్స్‌ప్రెస్‌లు జూలై ఒకటో తేది వరకు పొడిగించామని తెలిపారు. తిరుపతి-షోలాపూర్ మధ్య నడుస్తున్న (01438-01437) ఎక్స్‌ప్రెస్‌లు జూన్ 28 వరకు రాకపోకలు సాగిస్తాయని సీపీఆర్‌వో పేర్కొన్నారు.

పోలీసుల విధులకు ఆటంకం కేసులో

35మందికి ఐదేళ్ల జైలు

పిచ్చాటూరు, మార్చి 28 : పోలీసుల విధులకు ఆటంకం కలిగించారంటూ నమోదైన కేసులో ఒకే ఊరికి చెందిన 35మందికి ఐదేళ్ల జైలు శిక్ష విధించారు.కేసు వివరాల్లోకి వెళితే....పిచ్చాటూరు మండలంలోని ఎస్ఎస్‌బీ పేట తమిళనాడు సరిహద్దుకు అర్ధ కిలోమీటరు దూరంలో వుంటుంది.2018వ సంవత్సరంలో వేలంపాట ద్వారా మద్యం దుకాణం దక్కించుకున్న వారు ఇక్కడ షాపు ఏర్పాటు చేశారు.అయితే మద్యం దుకాణం వుండడం వల్ల తమిళనాడుకు చెందిన వారు అక్కడికి ఎక్కువగా వస్తుంటారని భావించిన గ్రామస్థులు గొడవలు జరుగుతుంటాయన్న ఆలోచనతో అక్కడ షాపు పెట్టడానికి వీల్లేదని పెద్దఎత్తున ఆందోళనకు దిగారు.అయితే మద్యం షాపు నిర్వహణకు లైసెన్స్ ఉన్నందున ఆందోళన విరమించుకోవాలని గ్రామస్థులను పోలీసులు హెచ్చరించారు. దీంతో రెచ్చిపోయిన పలువురు యువకులు మద్యం షాపుపై దాడి చేసి ధ్వంసం చేశారు. విధుల్లో ఉన్న పోలీసులతో కూడా గొడవకు దిగారు. దాంతో ఎస్ఎస్‌బీ పేటకు చెందిన 35మందిపై పోలీసులు కేసు నమోదు చేసి కోర్టుకు తరలించారు.ఆరేళ్లుగా నడుస్తున్న ఈ కేసుకు సంబంధించి గురువారం సత్యవేడు న్యాయమూర్తి గోపాలకృష్ణ తీర్పు వెలువరించారు.పోలీసుల విధులకు ఆటంకం కలిగించినందుకు 35మందికి రెండు సంవత్సరాల జైలు శిక్ష, వైన్‌షాపు ధ్వంసం చేసినందుకు మరో రెండు సంవత్సరాలు, షాపు నిర్వాహకులను బెదిరించినందుకు ఏడాది మొత్తంగా ఐదేళ్ళ జైలు శిక్ష విధించారు.దీంతో శిక్ష పడిన 35మందినీ కడప కారాగారానికి తరలించారు.కోర్టులో ప్రాసిక్యూషన్ తరపున ఏపీపీ ప్రశాంతి వాదించారు. కేసు విచారణను పర్యవేక్షించినందుకు సీఐ భాస్కర్ నాయక్,ఎస్ఐ వెంకటేష్, కోర్టు పీసీ దేవరాజ్‌లను ఎస్పీ కృష్ణకాంత్ పటేల్ , పుత్తూరు డీఎస్పీ శ్రీనివాసులు అభినందించారు.

కోడ్ ఉల్లంఘనలపై చర్యలు చేపట్టాం: కలెక్టర్


రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 28: ఎన్నికల కోడ్ ఉల్లంఘనలపై అందే ప్రతి ఫిర్యాదుపైనా రాజకీయ పార్టీలకు అతీతంగా చర్యలు చేపడుతున్నామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షన్మోహన్ తెలిపారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో గురువారం ఆయన సమావేశమయ్యారు. కేంద్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు రాజకీయ పార్టీలు ప్రచారాల కోసం ముందస్తు అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. 48 గంటల ముందుగా సువిధ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. 85 సంవత్సరాల పైబడిన, విభిన్న ప్రతిభావంతులకు ఇంటి నుంచే ఓటింగ్ విధానంపై కసరత్తు చేపట్టామని, అందుకు గల కారణాలను ఆయన వివరించారు. టెలివిజన్ ఛానల్‌లో, కేబుల్ నెట్‌వర్కులు, డిజిటల్ డిస్‌ప్లేలు, వాయిస్ మేసేజ్‌ల ప్రచారానికి అనుమతి తీసుకోవాలని స్పష్టంచేశారు. ఇంటింటి ప్రచారానికి రోజువారి అనుమతులు తీసుకోవాలనే దానిపై పునఃసమీక్షించాలని పలువురు నాయకులు కోరారు. ఈ అంశాన్ని రాష్ట్ర ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళ్తానన్నారు. ట్రేడ్ యూనియన్ వద్ద జెండాలు తొలగిస్తున్నారని, ఇది ఎన్నికల కోడ్ పరిధిలోకి రాదని సీపీఎం గంగరాజు వివరించారు. రాజీనామా చేసిన వలంటీర్ల నుంచి సిమ్‌కార్డులు, మొబైల్స్ వెనక్కి తీసుకోవాలని కొందరు సూచించగా, వారి రాజీనామా పత్రాన్ని ఆమోదించాక తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో జేసీ శ్రీనివాసులు, డీఆర్వో పుల్లయ్య, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ లక్ష్మీప్రసన్న, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఈవీఎం గోదాము పరిశీలన

రాజకీయ పార్టీ ప్రతినిధులతో కలిసి కలెక్టరేట్‌లోని ఈవీఎం గోదామును కలెక్టరు పరిశీలించారు. మే 13న పోలింగ్ ఉన్న నేపథ్యంలో 10 రోజులు ముందుగా ఈవీఎంలను పోలీసు బందోబస్తు మధ్య నియోజకవర్గ స్థాయిలో స్ట్రాంగ్ రూములకు తరలిస్తామన్నారు. మే 9న ఈవీఎంలను మరోసారి పరిశీలిస్తామన్నారు. డీఆర్‌వో పుల్లయ్యతో పాటు నేతలు అట్లూరి శ్రీనివాసులు (బీజేపీ), గంగరాజు (సీపీఎం), భాస్కర్ (కాంగ్రెస్), సురేంద్రకుమార్ (టీడీపీ), ఉదయ్‌కుమార్ (వైసీపీ) తదితరులు పాల్గొన్నారు.

వైసీపీకి ఇద్దరు కార్పొరేటర్ల రాజీనామా

● సొంత పార్టీ నాయకుల దూషణలతోనే నిర్ణయం



తిరుపతి(ఉపాధ్యాయనగర్), మార్చి 28: తిరుపతి నగరపాలక సంస్థ 48,49 డివిజన్ల కార్పొరేటర్లు అన్నా అనితాయాదవ్, డాక్టర్ అన్నా సంధ్యాయాదవ్ వైసీపీకి రాజీనామా చేశారు. గురువారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో వారు తమ తండ్రి అన్నా రామచంద్ర యాదవ్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. తిరుపతిలోని కొందరు వైసీపీ నాయకుల పద్ధతులు నచ్చక తమ తండ్రి బుధవారం పార్టీకి రాజీనామా చేశారని చెప్పారు.దీంతో కొంతమంది వైసీపీ యాదవ నేతలు ప్రెస్‌మీట్ పెట్టి ఇద్దరు కుమార్తెలతో కూడా రాజీనామా చేయించాలని సవాల్ చేశారని, అలాగే తమ తండ్రిపై అనేక ఆరోపణలు చేశారన్నారు. సొంత పార్టీ నాయకులు ఇష్టారీతిన దూషిండంతో తాము పార్టీకి రాజీనామా చేస్తున్నట్టు వెల్లడించారు. అనంతరం అన్నా రామచంద్ర యాదవ్ మాట్లాడుతూ... వైసీపీ నాయకులు పెట్టే టార్చర్ భరించలేక తన బిడ్డలు చాలా ఇబ్బంది పడ్డారన్నారు. కనీసం వార్డు వలంటీర్లను నియమించుకునే పరిస్థితి కూడా లేదంటే పార్టీలో పరిస్థితులు ఎలా ఉన్నాయో అర్థం చేసుకోవాలన్నారు.వైసీపీ యాదవ నేతలు చేసిన ఆరోపణలను విలేకరులు ప్రస్తావించగా... కాపు, ఒంటరి, తెలగ, బలిజ కులాలను బీసీ జాబితాలో చేర్చడం మంచిది కాదని తాను టీడీపీలో ఉన్నపుడు దీక్షకు కూర్చున్నట్టు వెల్లడించారు. తనను అరెస్ట్ చేసేందుకు పెద్దసంఖ్యలో పోలీసులు రాగా అరెస్ట్ చేయొద్దని కరుణాకరరెడ్డి చెప్పడంతో వెనక్కు వెళ్లిపోయారని చెప్పారు. అయితే తనను ఎన్‌కౌంటర్ చేసేందుకు టీడీపీ ప్రయత్నించిందంటూ కరుణాకరరెడ్డి మరునాడు పత్రికా ప్రకటన ఇవ్వడంతో ఆశ్చర్యపోయానన్నారు.తానెప్పుడూ పదవులు అడగలేదని, ఆయనే తన ఇంటికివచ్చి తన చిన్న కుమార్తెకు మేయర్ పదవి ఇస్తానని కొడుకు, మనవడి మీద ప్రమాణంచేసి చెప్పారని వెల్లడించారు. ఆ సమయంలో పాలగిరి ప్రతాపరెడ్డి, సిద్ధారెడ్డి పక్కనే ఉన్నారన్నారు.తీరా మేయర్ నియామకం అయిన తరువాత ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామితో మళ్లీ తమ ఇంటికివచ్చి చివరి రెండున్నర సంవత్సరాలు మేయర్ పదవి ఇస్తానని కొందరు మీడియా ప్రతినిధుల సాక్షిగా, వేంకటేశ్వరస్వామి సాక్షిగా చెప్పారని, తాను వద్దన్నానని వివరించారు.మేయర్ పదవి తాము అడిగామో, ఆయన ఇస్తానన్నారో కరుణాకరరెడ్డే సమాధానం చెప్పాలిగాని ఈ విషయాలేవీ తెలియనివారు ఏవేవో మాట్లాడడమేంటని ప్రశ్నించారు.తన కుమార్తెలు కార్పొరేటర్లుగా కొనసాగుతారని చెప్పారు.

వైసీపీ ప్రచార, ప్రభావిత సామగ్రి విలువ రూ.46కోట్లు

● జిల్లా ఎన్నికల అధికారికి నివేదిక అందజేత


వైసీపీ ప్రచార సామగ్రి వున్న వీసీఆర్ గోదాము - గోదాముకు వేసిన తాళం

రేణిగుంట, మార్చి 28: తిరుపతి విమానాశ్రయ సమీపంలోని ప్రైవేటు గోదాముల్లో నిల్వ ఉంచిన వైసీపీ ప్రచార సామగ్రి విలువ రూ.46కోట్లుగా అధికారులు అంచనా వేశారు.దాదాపు 70మంది వీఆర్వోలు, వీఆర్ఏల చేత ప్రచార సామగ్రి పంచనామా రహస్యంగా నిర్వహించారు. పాత విమానాశ్రయం వద్ద ఉన్న రెండు గిడ్డంగుల్లో రూ.23కోట్లు, రేణిగుంట-శ్రీకాళహస్తి ప్రధాన రహదారిలోని వీసీఆర్ గోదాములో రూ.23కోట్ల విలువ చేసే వైసీపీ ప్రచార సామగ్రిని, వస్తువులను విడివిడిగా లెక్కకట్టారు. ఈ నివేదికలను జిల్లా ఎన్నికల అధికారికి బుధవారం రాత్రి సమర్పించారని సమాచారం.రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు దీనిపై జిల్లా ఎన్నికల అధికారి పంపే నివేదికను బట్టి తదుపరి చర్యలు తీసుకునే అవకాశం ఉండనుంది. మరోపక్క సీజ్ చేసిన గిడ్డంగుల వద్ద పోలీసు, రెవెన్యూశాఖ ప్రత్యేక గస్తీ నిర్వహిస్తున్నారు.

హత్యా రాజకీయాలతో లబ్ధికి జగన్ వ్యూహం

● మాజీ మంత్రి అమర్ విమర్శ

పలమనేరు, మార్చి 28: హత్యా రాజకీయాలతో లబ్ధి పొందేందుకు సీఎం జగన్ చూస్తున్నారని మాజీ మంత్రి అమరనాథరెడ్డి విమర్శించారు. పలమనేరులో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. గత ఎన్నికల సమయంలో జగన్ చిన్నాన్న వివేకానందరెడ్డి హత్య జరిగితే దాన్ని చంద్రబాబుపై తోసేశారన్నారు. ఆ తర్వాత ఐదేళ్ల కాలం ముఖ్యమంత్రిగా వుండి జగన్ ఏమి చేశారో ప్రజలందరికీ తెలుసన్నారు. వాళ్ల చిన్నాన్నను హత్యచేసినట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తిని పక్కన పెట్టుకుని.. తన చిన్నాన్న హత్య ఆ దేవుడికి తెలుసని, ఆయన (చనిపోయిన వివేకా)కు, జిల్లా ప్రజలకు తెలుసని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. వివేకా హత్య కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తిని సీబీఐ అరెస్టు చేయకుండా అడ్డుకొన్నది ఎవరో అందరికీ తెలుసన్నారు. 'ఇక వివేకా హత్య ఎలా జరిగిందో హత్యకు గురైన వివేకానే అడిగి తెలుసుకోవాల్సి ఉంటుంది. అది కూడా జగన్ మాత్రమే అడగాలి. ఇంకెవరూ అడగలేరు. జగనే వెళ్లి తన చిన్నాన్నతో ఎవరు నిన్ను హత్యచేశారు అని అడిగి తెలుసుకోవాలి' అంటూ వ్యంగ్యంగా మాట్లాడారు. కోడికత్తి కేసులో కూడా ఏం జరిగిందో అందరికీ తెలుసన్నారు. జగన్ నిన్న ఏమి చెప్పారో ప్రజలందరూ గుర్తుచేసుకోవాలని సూచించారు. ఇలాంటి ఆలోచనలున్న వ్యక్తిని మళ్లీ సీఎంను చేస్తే రాష్ట్రం ఏమవుతుందో ప్రజలు ఆలోచించాలని కోరారు.

నీటి ఎద్దడి ఏర్పడే గ్రామాలను గుర్తించండి

చిత్తూరు కలెక్టరేట్, మార్చి 28: ప్రస్తుత వేసవిలో నీటి ఎద్దడి ఏర్పడే గ్రామాలను గుర్తించి సోమవారం లోగా నివేదికలు ఇవ్వాలని కలెక్టర్ షన్మోహన్ ఆదేశించారు. గురువారం సాయంత్రం క్యాంపు కార్యాలయం నుంచి ఆయన మండల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎన్నికల విధులతో పాటు నీటి ఎద్దడి ఏర్పడకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. నీటి ఎద్దడి ఉండే గ్రామాల్లో హేబిటేషన్ల వారీగా అక్కడ ఉన్న నీటి వనరులను పరిశీలించి, ఆ నీటిని సరఫరా చేసే ప్రక్రియను గుర్తించాలన్నారు. పలమనేరు, కుప్పం, పుంగనూరు ప్రాంతాల్లోని కొన్ని చోట్ల నీటి సరఫరాలో ఇబ్బందులున్నాయని, వాటిని అధిగమించడానికి చర్యలు చేపట్టాలన్నారు. ట్యాంకర్ల ద్వారా నీటి రవాణాకు అనుమతి లేదని, పొరుగున ఉన్న బోర్ల నుంచి తాత్కాలిక పద్ధతిలో సమీప గ్రామాలకు తాగునీటి సరఫరా చేయాలన్నారు. ఇటీవల అంగన్‌వాడీ కేంద్రాల్లో వేసిన బోర్లను ఉపయోగించుకోవాలన్నారు. 250కి పైగా బోర్లున్న చోట్ల వాటి మరమ్మతులకోసం మరో మెకానిక్‌ను నియమించుకోవాలన్నారు. విడిభాగాల కొనుగోళ్లకు నివేదిక ఇవ్వాలని చెప్పారు.

ధనుష్‌ది ఆత్మహత్య కాదు.. హత్యే

మృతుడి కుటుంబ సభ్యులు, బంధువుల ఆరోపణ.. రాస్తారోకో


మృతిచెందిన ధనుష్

గంగాధరనెల్లూరు, మార్చి 28: గంగాధర నెల్లూరు మండలం వింజం దళితవాడకు చెందిన ధనుష్‌ది ఆత్మహత్య కాదని.. అమ్మాయి తరఫువారే హత్య చేశారంటూ అతడి కుటుంబీకులు, బంధువులు ఆరోపించారు. బాధ్యులను అరెస్ట్ చేయాలంటూ గురువారం సాయంత్రం వింజం బస్టాప్ వద్ద రోడ్డుపై బైఠాయించారు. వీరు తెలిపిన ప్రకారం.. ధనుష్, దళవాయిపల్లె దళితవాడకు చెందిన ఓ అమ్మాయి ప్రేమించుకున్నారు. ఈనెల 15న వీరిద్దరూ తవణంపల్లె మండలంలోని ఓ గుడిలో పెళ్లి చేసుకోవాలని వారి బంధువుల ఇంటికి వెళ్లారు. ఈ విషయం తెలిసి అమ్మాయి బంధువులు ధనుష్‌ని మందలించారు. అదేరోజు సాయంత్రం గంగాధరనెల్లూరు పోలీస్‌స్టేషన్‌లో వీరిద్దరి తల్లిదండ్రులను పిలిపించి పోలీసులు విచారించారు. ఆ అమ్మాయి మేజర్ అయ్యాక పెళ్లి చేసుకోవచ్చని పోలీసులు చెప్పి పంపారు. ఈ క్రమంలో బుధవారం సాయంత్రం వింజం దళితవాడకు సమీపంలో ఓ చెట్టుకు ధనుష్ ఉరేసుకున్నట్లు కుటుంబీకులకు తెలిసింది. వీరి సమాచారంతో సీఐ శంకర్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం ధనుష్ మృతదేహాన్ని చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోస్ట్‌మార్టం చేసి.. గురువారం మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడి తలకు గాయమైనట్లు వారి బంధువులు గుర్తించారు. దీంతో ధనుష్ ఆత్మహత్య చేసుకోలేదని, అమ్మాయి తరపున బంధువులు హత్యచేసి చెట్టుకు ఉరేసి వెళ్లుంటారనే అనుమానం కలిగింది. వెంటనే మూడు గంటలపాటు వింజం బస్టాప్‌వద్ద రోడ్డుపై వీరు బైఠాయించారు. ధనుష్ హత్యకు కారణమైన వారిని వెంటనే అరెస్ట్‌చేసి చర్యలు తీసుకోవాలని డిమాండు చేశారు. సీఐలు శంకర్, విశ్వనాథరెడ్డి, ఎస్‌ఐ రామాంజనేయులు, సిబ్బంది అక్కడికి చేరుకుని రోడ్డుపై కూర్చోవడం సరికాదని సర్దిచెప్పారు. పోస్ట్‌మార్టం రిపోర్ట్ ప్రకారంగా కేసు నమోదుచేసి, హత్యకు కారణమైన వారిని అరెస్ట్ చేస్తామని హామీ ఇచ్చారు. ధనుష్‌కు అంత్యక్రియలు నిర్వహించాలని సూచించగా.. వారు అంగీకరించలేదు. శుక్రవారం అంత్యక్రియలు చేస్తామని వారి బంధువులు తెలిపారు.

ఆరు ఎర్రచందనం దుంగల స్వాధీనం

ఒకరి అరెస్టు


అరెస్టు చూపుతున్న పోలీసులు

మంగళం, మార్చి 28: మంగళం పరిధిలోని తిమ్మినాయుడుపాళెం సమీపంలో గురువారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆరు ఎర్రచందనం దుంగలను, లగేజీ వాహనాన్ని, మోటారు సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఒకరిని అరెస్టు చేశారు. ఆర్ఎస్ఐ సురేష్‌బాబు బృందం మంగళం, భూపాల్‌కాలనీ, తిమ్మినాయుడుపాళెం అటవీ ప్రాంతంలో కూంబింగ్ నిర్వహించారు. బయోట్రిమ్ వద్ద లగేజీ వాహనంలో కొందరు వ్యక్తులు ఎర్రచందనం దుంగలు లోడ్‌చేస్తూ కనిపించారు. చుట్టుముట్టగా అందరూ పారిపోయి ఒకరు మాత్రం దొరికారు. పట్టుబడ్డ వ్యక్తి చిత్తూరు రూరల్ తుమ్మిందపాళేనికి చెందిన పవన్(23)గా గుర్తించారు. వారి నుంచి ఆరు దుంగలతోపాటు లగేజి వాహనం, ఒక బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. దుంగలను హోస్కోటకు తరలిస్తున్నట్లు విచారణలో వెల్లడైంది. ఈ కేసును తిరుపతి టాస్క్‌ఫోర్సు కార్యాలయ సీఐ శ్రీనివాసులు దర్యాప్తు చేస్తున్నారు.

భక్తిశ్రద్ధలతో ద్రౌపది కల్యాణోత్సవం



కల్లూరు, మార్చి 28: పులిచెర్ల మండలం దిగువపోకలవారిపల్లి పంచాయతీ ఎలకబైలు కురవపల్లిలో జరుగుతున్న మహాభారతం ఉత్సవాల్లో భాగంగా గురువారం భక్తి శ్రద్ధలతో ద్రౌపది కల్యాణోత్సవం నిర్వహించారు. ద్రౌపది అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం 3 గంటలకు అర్చకుల మంత్రోచ్చరణల నడుమ ద్రౌపది కల్యాణోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. ఈ వేడుకల్లో పాల్గొన్న దంపతులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అంతకుముందు ద్రౌపది కల్యాణం కథను భాగరతారిణి పూర్ణిమ వినిపించారు. రాత్రి చెంచునాటకం ప్రదర్శించారు. అమ్మవారి కల్యాణోత్సవానికి వడ్లపల్లి గిరిబాబు, చిగరమాకులపల్లి సుబ్రమణ్యం, మధ్యాహ్నం కథకు కురవపల్లి అంకన్న ఉభయదారులుగా వ్యవహరించారు.

టీడీపీలోనే బీసీలకు గుర్తింపు



మాట్లాడుతున్న టీడీపీ బీసీసెల్ కార్యనిర్వాహక కార్యదర్శి శ్రీకాంత్

పుంగనూరు రూరల్, మార్చి 28: తెలుగుదేశం పార్టీతోనే బీసీలకు గుర్తింపు వచ్చిందని టీడీపీ బీసీసెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎం.శ్రీకాంత్ పేర్కొన్నారు. గురువారం స్థానిక టీడీపీ కార్యాలయంలో జరిగిన జయహో బీసీ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే బీసీ కులస్తులకు ప్రత్యేక చట్టాన్ని తీసుకురావడం జరుగుతుందన్నారు. బీసీలకు పింఛన్లు అందివ్వడం, బీసీల అభివృద్ధికి మ్యానిఫెస్టోలో పెట్టిన పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ గెలుపు కోసం బడుగు బలహీన వర్గాల్లో చైతన్యం తీసుకువాలని పిలుపునిచ్చారు. మండల టీడీపీ అధ్యక్షుడు మాధవరెడ్డి మాట్లాడుతూ పుంగనూరు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ గెలుపు కోసం ప్రతి ఒక్కరూ సైనికుల్లా పని చేయాల్సివుందన్నారు. సమావేశంలో నాయకులు గంగాధర్, రెడ్డెప్ప, నూరుల్లా, ప్రసాద్, రామయ్య, చంద్ర, ఐటీడీపీ కుమార్, జనసేన నాయకులు చిన్నారాయల్, విరూపాక్షి, చైతన్యరాయల్ పాల్గొన్నారు.

రొంపిచెర్లలో పోలీసు కవాతు



రొంపిచెర్ల, మార్చి 28: మండలంలోని పలు గ్రామాల్లో గురువారం సాయుధ బలగాలతో పోలీసు కవాతు నిర్వహించినట్లు కల్లూరు సీఐ శ్రీనివాసులు, రొంపిచెర్ల ఎస్ఐ సుకుమార్ తెలిపారు. వారు మాట్లాడుతూ ఎన్నికల్లో ఎలాంటి అల్లర్లు జరగకుండా ప్రశాంత వాతావరణంలో పోలింగ్ జరిగేలా చూడటమే కవాతు ముఖ్య ఉద్దేశమన్నారు. ప్రజలు స్వేచ్ఛగా, నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని తెలిపారు.

వాహన తనిఖీలో రూ. 1.67 లక్షల నగదు స్వాధీనం

సోమల, మార్చి 28: సోమల-సదుం మార్గంలో వాహన తనిఖీలో రూ.1.67 లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ వెంకట నరసింహులు తెలిపారు. గురువారం కందూరు క్రాస్ రోడ్డులో పోలీసులు వాహనాల తనిఖీ చేస్తుండగా బెంగళూరుకు చెందిన సురేశ్ బైకుపై రూ.77 వేలు తీసుకు వస్తుండగా గుర్తించారు. ఎటువంటి రసీదులు లేక పోవడంతో పోలీసులు నగదును స్వాధీనం చేసుకున్నారు. అలాగే రామసముద్రానికి చెందిన మంజునాథ్ వద్ద రూ. 90 వేలు స్వాధీనం చేసుకున్నారు. కార్యక్రమంలో హెచ్‌సీ దేవరాజులు, నగేశ్, సుబ్రహ్మణ్యం, రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలో చేరిక



అమరనాథ రెడ్డి సమక్షంలో టీడీపీ చేరిన వైసీపీ నేతలు

గంగవరం, మార్చి 28 : గంగవరం పంచాయతీలో వైసీపీ నేతలైన స్వాతి, కిరణ్ ఆధ్వర్యంలో 20 కుటుంబాలు మాజీ మంత్రి అమరనాథ రెడ్డి ఆధ్వర్యంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. గురువారం గంగవరం మండలం డ్రైవర్స్‌కాలనీలో మాజీ మంత్రి పర్యటనలో ఆ కుటుంబాలన్నీ పార్టీలోకి చేరగా టీడీపీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో కిరణ్, స్వాతి, యస్వంత్, రమేష్, భారతి, పళణి, ఆనంద్, ప్రియా, సుబ్రమణ్యం, నాగరాజు,నయాజ్, హయత్, హుస్సేన్, బాలు, రాజు, షౌకత్, బాలాజి, సంతోష్, ఫైరోజ్, నడింపల్లెకు చెందిన వార్డుమెంబర్ బాబు, మన్నార్‌నాయినపల్లెకు చెందిన యుగంధర్, చిన్నూరుకు చెందిన రామచంద్ర తదితర కుటుంబాలు ఉన్నాయి. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు సోమశేఖర్‌గౌడ్, ప్రతాప్‌రెడ్డి, యుగంధర్, ఎస్సీసెల్ రవి, ప్రమీళ, గిరిబాబులతోపాటు పలువురు పాల్గొన్నారు.

భవిష్యత్ తరాల కోసం పనిచేసే పార్టీలకు ఓటు వేయాలి



మాట్లాడుతున్న అయూబ్‌ఖాన్

పుంగనూరు రూరల్, మార్చి 28: భావితరాల కోసం, రాష్ట్రాభివృద్ధి కోసం పని చేసే రాజకీయ పార్టీని గెలిపించాల్సిన అవసరముందని మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం ట్రస్ట్ ఛైర్మన్ అయూబ్‌ఖాన్ పిలుపునిచ్చారు. గురువారం ఓటు హక్కు వినియోగంపై రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటును డబ్బు, మద్యానికి అమ్ముడుపోకుండా మంచి పాలన అందించే రాజకీయపార్టీని గెలిపించాల్సివుందన్నారు. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును సక్రమంగా వినియోగించుకోవాలని సూచించారు. నాయకులు శ్రీనివాసులు, గంగరాజు, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు సహకరించాలి

రామకుప్పం, మార్చి 28: ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు అన్ని రాజకీయపక్షాలు, ప్రజలు అధికార యంత్రాంగానికి సహకరించాలని కుప్పం గ్రామీణ సీఐ ఈశ్వర్‌రెడ్డి, రామకుప్పం ఎస్ఐ శివకుమార్ కోరారు. గురువారం మండల పరిధిలోని ఆరిమానిపెంట, వీర్నమల గ్రామాల్లో కేంద్ర రిజర్వు పోలీసు బలగాలు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో రాజకీయ నేతలు, గ్రామస్థులతో ఏర్పాటు చేసిన సమావేశాల్లో వారు మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా గ్రామాల్లో ప్రశాంత వాతావరణానికి భంగం కలిగిస్తే ఎంతటి వారైనా సహించేది లేదని, చట్ట ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు. ఓటర్లు ఓటుహక్కును నిర్భయంగా వినియోగించుకోవాలన్నారు. ఈ విషయంలో తాము వారికి అన్నివిధాలా అండగా ఉంటామన్నారు.

గ్రంథాలయానికి ఫర్నిచర్ వితరణ

కుప్పం, మార్చి 28: కుప్పం ఇంజినీరింగ్ కళాశాల సీఈవో ఎన్.సాగర్‌రాజ్ జన్మదినం సందర్భంగా గురువారం గుడుపల్లె ప్రభుత్వ గ్రంథాలయానికి రూ.30 వేలు విలువ కలిగిన బీరువా, కుర్చీలు వితరణ చేశారు. అలాగే శెట్టిపల్లెలోని విక్టరీ బోర్డింగ్ స్కూల్ బధిర పాఠశాల విద్యార్థులకు అన్నదానం చేశారు.

హామీలు ఎగ్గొట్టినందుకు జగన్‌కు ఓటేయాలా?

టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పీఎస్ మునిరత్నం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పీఎస్ఎం

కుప్పం, మార్చి 28: ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నింటినీ జగన్‌రెడ్డి గద్దెనెక్కాక మరచిపోయారని తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పీఎస్.మునిరత్నం విమర్శించారు. హామీలు ఎగ్గొట్టినందుకు ఆయనకు ఓటేయాలా అని నిలదీశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మద్యనిషేధం చేసి ఓటు అడుగుతానని జగన్ చెప్పారని, ఇప్పుడు ఎక్కడ చూసినా నాసిరకం బ్రాండ్ల మద్యం ఏరులై పారుతోందని, అందువల్ల లక్షలాది మంది ఆరోగ్యాలు నాశనమయ్యాయని ధ్వజమెత్తారు. విద్యుత్తు ఛార్జీల తగ్గింపు హామీ నెరవేర్చకపోగా మాట తప్పి, మడమ తిప్పారన్నారు. దీనికి పూర్తి వ్యతిరేకంగా విద్యుత్తు ఛార్జీలను ఏకంగా 9 సార్లు పెంచి వినియోగదారులపై రూ.64 వేల కోట్ల భారం వేశారని విమర్శించారు. మెగా డీఎస్సీ, ప్రతి జనవరిలో జాబ్ క్యాలెండర్ విడుదల, ఇసుక ధరల తగ్గింపు, కాంట్రాక్టు ఉద్యోగుల రెగ్యులైజేషన్, ఉద్యోగులకు సకాలంలో డీఏ చెల్లింపు, పిల్లలందరికీ అమ్మఒడి, అన్న క్యాంటీన్ల కొనసాగింపు, సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మాణం, అసైన్డ్ భూముల పరిరక్షణ వంటి హామీలన్నిటినీ జగన్‌రెడ్డి తుంగలో తొక్కారని విమర్శించారు. రాష్ట్రంలో 14 లక్షల ఎకరాల భూములను కబ్జా చేశారని, ఇసుక దోపిడీ, మద్యం మాఫియా, క్వారీల దోపిడీ ఇలా జగన్ పాలన దోపిడీలమయంగా సాగిందని ఆయన ధ్వజమెత్తారు. టీడీపీతోనే తమ భవిష్యత్తు అని రాష్ట్ర ప్రజలందరూ ఇప్పటికే ఒక నిర్ణయానికి వచ్చేశారని, రేపటి ఎన్నికల్లో తమ పార్టీ ఘన విజయం సాధించి చంద్రబాబు అత్యధిక మెజారిటీతో గెలిచి ప్రభుత్వం ఏర్పాటు చేయడం ఖాయమని పీఎస్ఎం స్పష్టం చేశారు.

టీడీపీకి పెరుగుతున్న ఆదరణ చూడలేకే దాడులు





మాట్లాడుతున్న గౌనివారి శ్రీనివాసులు, డాక్టర్ సురేష్‌బాబు తదితరులు, పలమనేరులో టీడీపీలో చేరిన వారితో అమరనాథరెడ్డి

శాంతిపురం, మార్చి 28 : రోజురోజుకు టీడీపీకి పెరుగుతున్న ప్రజాదరణ చూడలేకే కార్యకర్తలు, నాయకులపైన వైసీపీ నేతలు, కార్యకర్తల చేత దాడి చేయిస్తున్నారని మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ సురేష్‌బాబు, మండల టీడీపీ అధ్యక్షుడు భాష్యం విశ్వనాథ్‌నాయుడు అన్నారు. గురువారం టీడీపీ కార్యాలయంలో నేతలతో కలిసి విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఐదు సంవత్సరాల్లో వైసీపీ అరాచక పాలనతో విసిగి చెందిన ఆ పార్టీ కార్యకర్తలు పార్టీని వీడి టీడీపీలో చేరుతుంటే అక్కసుతో వారిపై దాడి చేయడం ఓటమిని అంగీకరించినట్లేనన్నారు. శాంతిపురం మండలం శివరామపురంలో ఈ మధ్య కాలంలో వైసీపీని వీడి టీడీపీలో చేరిన హరీష్, అతడి తల్లి ప్రమీలమ్మపై చంద్రబాబు పర్యటనకు వెళ్లారని దాడి చేయడం ఎంతవరకు న్యాయమన్నారు. వారిపై దాడి చేసిన వారిని చట్టపరంగా చర్యలు తీసుకుని కఠినంగా శిక్షించాలని పోలీసులను కోరారు. ఇలాంటి దాడులు రాష్ట్రంలో చాలా జరుగుతున్నాయని, అలాంటి వారిని వదిలిపెట్టేది లేదన్నారు. ఈసారి కుప్పంలో వైసీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులకు డిపాజిట్లు గల్లంతు కావడం ఖాయమన్నారు. కుప్పంలో అభివృద్ధి గురించి మాట్లాడే మీరు ఐదేళ్లలో ఎంత అభివృద్ధి చేశారో బహిరంగ చర్చకు సిద్ధమా అని ప్రశ్నించారు. అదే చంద్రబాబు చేసిన అభివృద్ధి గురించి గ్రామాలకు వెళితే చెబుతారన్నారు. రానున్న ఎన్నికల్లో నారా చంద్రబాబు లక్ష ఓట్ల మెజారిటీతో గెలుపొంది రాష్ట్రానికి ముఖ్యమంత్రి కావడం ఖాయమన్నారు.

టీడీపీలో చేరిన వైసీపీ కార్యకర్తలు

మండల పరిధిలోని కోనేరుకుప్పం, కోలాలతిమ్మనపల్లెలకు చెందిన 25 వైసీపీ కుటుంబాలు ఆ పార్టీని వీడి టీడీపీలో చేరారు. కోనేరుకుప్పం గ్రామానికి చెందిన మూర్తి, షాజహాన్, గణేష్, గంగాధరం, వెంకటాచలం, కోలాలతిమ్మనపల్లె గ్రామానికి చెందిన వెంకటప్పగౌడు, భాలకృష్ణ, మురుగేష్, మునిరత్నం మూర్తి, అంజి, లక్ష్మణ్, రాము, గోపి, నాగరాజుతోపాటు మరో 10కుటుంబాల కార్యకర్తలు రాళ్ళబూదుగూరు యూనిట్ ఇన్‌చార్జి ఆర్ఎస్ మణి, కోనేరుకుప్పం పంచాయతీ పార్టీ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, మాజీ ఎంపీటీసీ అర్జునప్ప సహకారంతో టీడీపీలో చేరారు. వారందరికీ టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ సురేష్ బాబు, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు టీడీపీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో నేతలు ఉదయ కుమార్, విజయరామిరెడ్డి, చంద్రశేఖర్, వెంకటరమబాబు, నాగరాజు, రాజారామ్, ఎఎంసి నాగరాజు, ఈడిగ శివశంకర్, వెంకట్రామప్ప, దుబాయిగౌడు, శ్రీనివాసులు, జయపాల్ పాల్గొన్నారు.

పలమనేరు : పలమనేరులో మాజీ మంత్రి అమరనాథ రెడ్డి ఆధ్వర్యంలో గురువారం 22, 23 వార్డులకు చెందిన పలువురు వైసీపీ నాయకులు తెలుగుదేశం పార్టీలో చేరారు. పలమనేరు గంగమ్మగుడి డైరెక్టర్ వేణుగోపాల్, కృష్ణమూర్తి, గండన్న అలియాస్ రంగప్ప, రామన్న, వారి అనుచరులు తెలుగుదేశం పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి అమరనాథరెడ్డి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు.

గంగ జాతర నిర్వహణకు పకడ్బందీ చర్యలు



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ నరసింహప్రసాద్‌రెడ్డి

పుంగనూరు, మార్చి 28: ఏప్రిల్ 2, 3 తేదీల్లో పుంగనూరు సుగుటూరు గంగమ్మ జాతరను పకడ్బందీగా నిర్వహించడానికి ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు మున్సిపల్ కమిషనర్ నరసింహప్రసాద్‌రెడ్డి తెలిపారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో అగ్నిమాపక అధికారి సుబ్బరాజు, సీఐ రాఘవరెడ్డి, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రంజితతోపాటు సచివాలయ ఉద్యోగులు, మున్సిపల్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతర జరిగే రెండు రోజులు పారిశుధ్యం, వీధిలైట్లు, మంచినీరు, చలువ పందిళ్లు, పార్కింగ్ తదితర వాటిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు ఆయన వివరించారు. సీఐ రాఘవరెడ్డి మాట్లాడుతూ పట్టణంలో ట్రాఫిక్ సమస్య లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. భారీ వాహనాలను పట్టణంలోకి అనుమతులు పూర్తిగా నిషేధిస్తామన్నారు. సమావేశంలో మున్సిపల్ డీఈఈ మహేశ్, ఏఈ కృష్ణకుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

2800 లీటర్ల సారా ఊట ధ్వంసం



సదుం, మార్చి 28: మండల పరిధిలోని చీకలచేను అటవీ శివారు ప్రాంతంలో 2800 లీటర్ల నాటు సారా ఊటను ధ్వంసం చేసినట్లు సదుం ఎస్ఐ మారుతి గురువారం తెలిపారు. సారా ఊటను ధ్వంసం చేయడమే కాకుండా 38 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నామని, తయారీదారులు పరారైనట్లు ఆయన తెలిపారు.

పాముకాటుతో రైతు మృతి



రమణప్ప(ఫైల్)

బైరెడ్డిపల్లె, మార్చి 28 : మండలంలోని ఎం.కొత్తూరు గ్రామానికి చెందిన రైతు రమణప్ప(55) గురువారం పాముకాటుకు గురై మృతిచెందినట్లు గ్రామస్తులు తెలిపారు. రమణప్ప గురువారం మధ్యాహ్నం తన పొలం వద్ద పనులు చేసుకుంటుండగా పాము కరిచింది. దీంతో కుటుంబీకులు ఆయనను పలమనేరులో ఓ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్సపొందుతూ మృతిచెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె వున్నారు. రమణప్ప మృతి వారి కుటుంబంలో తీవ్ర విషాదాన్ని నింపింది.

గుండెపోటుతో కూలీ మృతి



రాజా(ఫైల్ ఫొటో)

చిత్తూరు రూరల్, మార్చి 28: గుండెపోటుతో ఓ కూలీ మృతి చెందాడు. చిత్తూరు మండలంలోని నల్ల వెంకటయ్యగారిపల్లె దళితవాడకు చెందిన గంబీరం కుమారుడు రాజా(40) గురువారం పొలంలో పనిచేస్తుండగా గుండెపోటు వచ్చింది. దీంతో అతడిని చికిత్స నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి, ఆ తరువాత సీఎంసీకి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

లారీని వెనుక నుంచి ఢీకొన్న కారు

ఒకరికి తీవ్ర గాయాలు

తవణంపల్లె, మార్చి 28: లారీని వెనుక నుంచి కారు ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలో గురువారం వేకువజామున చోటుచేసుకుంది. ఎస్ఐ కథనం మేరకు వివరాలు. కర్ణాటక రాష్ట్రం బెంగళూరుకు చెందిన మహేష్ తిరుపతి నుంచి బెంగళూరు వెళుతూ మండలంలోని కె.పట్నం సమీపంలో తిరుపతి-బెంగళూరు హైవేపై లారీని వెనుక నుంచి ఢీ కొన్నారు. దీంతో మహేష్‌కు తీవ్రగాయాలయ్యాయి. ఇతడిని చికిత్స నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించి, మెరుగైన చికిత్స నిమిత్తం వేలూరు సీఎంసీకి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

దుర్గాంబకు రూ. 3.82 లక్షల ఆదాయం

చిత్తూరు కల్చరల్, మార్చి 28: గిరింపేట దుర్గాంబ ఆలయంలో గురువారం ఈవో మునిశేఖర్ ఆధ్వర్యంలో హుండీ లెక్కింపు జరిగింది. ఈ సందర్భంగా రూ.3.82 లక్షలు ఆదాయం వచ్చిందని ఈవో తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు దిలీప్‌రెడ్డి, రవికుమార్, వి. లక్ష్మి, నాగవేణి, లావణ్య, గోవర్ధన్, శ్రీకాంత్, అర్చకులు జగదీశ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మహాభారత ఉత్సవాలు ప్రారంభం



చిత్తూరు కల్చరల్, మార్చి 28: నగరపాలక పరిధిలోని కుక్కలపల్లె లక్ష్మయ్య కండ్రిగలోని ద్రౌపది సమేత ధర్మరాజుల ఆలయంలో గురువారం ఉదయం ఆలయ అర్చకులు గోపాల అయ్యంగార్ బృందం ధ్వజారోహణంతో మహాభారత ఉత్సవాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త పూల సుబ్రమణ్యం, కుమారస్వామి నాయుడు, సిద్దయ్య నాయుడు, హరిబాబు నాయుడు, రవి నాయుడు, రామచంద్రయ్య, గోవిందయ్య, భక్తులు పాల్గొన్నారు. మహాభారత ఉత్సవాల్లో ప్రతి రోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటలకు వరకు ప్రముఖ కళాకారిణి సీతాలక్ష్మిచే మహాభారతంలోని ఘట్టాల హరికథలు, సాయంత్రం ప్రతి రోజు 9 గంటల నుంచి మరుసటి రోజు ఉదయం 6 గంటలకు వరకు మహాభారత నాటకాలు ప్రదర్శించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

విలువలతో కూడిన విద్య అవసరం

చిత్తూరు (సెంట్రల్), మార్చి 28: నేటి ఆధునిక సమాజంలో విలువలతో కూడిన విద్య ఎంతో అవసరమని సీనియర్ సివిల్ జడ్జి కరుణకుమార్ పేర్కొన్నారు. గురువారం స్థానిక ఎస్‌పీ సావిత్రమ్మ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో 42వ వార్షికోత్సవాన్ని ప్రిన్సిపాల్ మనోహర్ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కరుణకుమార్ మాట్లాడుతూ సమాజంలో మహిళల పట్ల గౌరవ మర్యాదలు మరింత పెరగాల్సిన అవసరం ఉందని గుర్తు చేశారు. విద్యతోపాటు తాను ఎంపిక చేసుకున్న రంగాల్లో ప్రతి మహిళా రాణించాలని ఆకాంక్షించారు. మాజీ ఎమ్మెల్యే, గౌరవ అతిథి వెంకటేశ్వరచౌదరి మాట్లాడుతూ ఒక కుటుంబం అభివృద్ధి ఆ కుటుంబంలోని మహిళపై ఆధారపడి ఉంటుందన్నారు. అతిథులు దరశరథరెడ్డి, రమాదేవి, అనిత తదితరులు మాట్లాడుతూ ప్రపంచం సాంకేతిక పరంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో మహిళలు అన్ని రంగాల్లోనూ భాగస్వాములు కావాలన్నారు. గతేడాది అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ఎస్‌పీ సావిత్రమ్మ బంగారు పతకాలు అందజేశారు. 25 మంది పేద విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.4 వేలు అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో అధ్యాపకులు నరేంద్రకుమార్, ఉష పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్‌ను అతిక్రమిస్తే కఠిన చర్యలు : డీఎస్పీ

విజయపురం, మార్చి 28: ఎన్నికల నియమావళిని అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ మూర్తి హెచ్చరించారు. గురువారం మండలంలోని విజయపురం హరిజనవాడలో గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఎన్నికలు సజావుగా నడవడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ తమ పిల్లలకు మంచి విద్యా బుద్ధులు నేర్పించి, ఉన్నత స్థాయికి ఎదిగేలా తీర్చిదిద్దాలని కోరారు. కార్యక్రమంలో సీఐ సుబ్బరామిరెడ్డి, ఎస్ఐ జయప్ప పాల్గొన్నారు.

మద్యం దుకాణం తనిఖీ

గుడిపాల, మార్చి 28: మండలంలోని బసవాపల్లి పంచాయతీ రెట్టగుంట గ్రామ సమీపంలో ఉన్న ప్రభుత్వ మద్యం షాపును గురువారం ఎస్ఐ శ్రీనివాసరావు తనిఖీ చేశారు. స్టాకు నిల్వ, తదితర వివరాలపై ఆరాతీశారు.

1 నుంచి పాలిసెట్ ఉచిత కోచింగ్

కుప్పం, మార్చి 28: స్థానిక డాక్టర్ వైసీ జేమ్స్‌ఎన్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏప్రిల్ 1 నుంచి 24వ తేదీ వరకు ఉచితంగా పాలిసెట్-2024కు కోచింగ్ ఇవ్వనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.జగన్నాథరావు తెలిపారు. మెటీరియల్ కూడా ఉచితంగానే ఇస్తామన్నారు. పాలిసెట్‌కు దరఖాస్తు చేసుకోవడానికి ఏప్రిల్ 5 తుది గడువు అని చెప్పారు. దరఖాస్తు చేసుకునేవారు వారి 10వ తరగతి హాల్ టికెట్టు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, ఆధార్‌కార్డు, మొబైల్ ఫోన్ తప్పకుండా తీసుకు రావాలని సూచించారు. తమ కళాశాలలోని హెల్ప్‌లైన్ క్రేంద్రం ద్వారా ఉచితంగా రిజిస్టర్ చేస్తామన్నారు. పాలీసెట్ ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 27న కుప్పం, పలమనేరు కేంద్రాలుగా నిర్వహిస్తామని చెప్పారు. వివరాలకు 9989064100, 9490309037 అనే నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

పుంగనూరు న్యాయవాదుల సంఘ అధ్యక్షుడిగా చెన్నకేశవులు



చెన్నకేశవులు

పుంగనూరు రూరల్, మార్చి 28: పుంగనూరు న్యాయవాదుల సంఘ నూతన అధ్యక్షుడిగా ఆకుల చెన్నకేశవులు ఎన్నికైనట్లు ఎన్నికల అధికారులు మల్లికార్జునరెడ్డి, వెంకటరెడ్డి తెలిపారు. గురువారం స్థానిక కోర్టు ఆవరణలో జరిగిన న్యాయవాదుల సంఘం అధ్యక్ష స్థానానికి జరిగిన ఎన్నికల్లో ఆకుల చెన్నకేశవులుకు 57ఓట్లు, విజయకుమార్‌కు 37 ఓట్లు రావడంతో ఆకుల చెన్నకేశవులు గెలిపొందినట్లు ప్రకటించారు. ఉపాధ్యక్షుడిగా అరవింద్‌కుమార్, ఎల్వీ రమణలు పోటీపడగా అరవింద్‌కుమార్ గెలుపొందారు. మొత్తం న్యాయవాదులు 97 మంది ఓటింగ్‌లో పాల్గొనగా అందులో మూడు ఓట్లు చెల్లలేదని వారు తెలిపారు. కార్యదర్శిగా వై.రఘునాథరెడ్డి, స్పోర్ట్స్ కార్యదర్శిగా సీవీ.రమేశ్, కోశాధికారిగా ప్రశాంతి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు వివరించారు.

చంద్రబాబును కలిసిన అనీషారెడ్డి



పుంగనూరు, మార్చి 28: మదనపల్లె పర్యటనలో ఉన్న మాజీ సీఎం చంద్రబాబునాయుడును గురువారం పుంగనూరు నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జి ఎన్.అనీషారెడ్డి కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆమె మాట్లాడుతూ టీడీపీ గెలుపు కోసం తన వంతుగా కృషి చేస్తానని తెలిపినట్లు తెలిపారు.

మాజీ మంత్రి అమర్‌కు సన్మానం

పలమనేరు, మార్చి28 : తెలుగుదేశం పార్టీలో చేరిన మున్సిపల్ కౌన్సిలర్ బీఆర్‌సీ కుమార్, మాజీ కౌన్సిలర్ కృష్ణమూర్తి గురువారం మాజీ మంత్రి అమరనాథరెడ్డిని కలిసి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ ఘనవిజయం సాధించేందుకు తాము పని చేస్తామని పేర్కొన్నారు. టీడీపీ నాయకులు ఖాజాపీర్,నాగరాజు, మదన్, జగదీష్, శ్రీధర్, జగదీషనాయుడు, చిన్ని, వీరప్ప, సుబ్బు, రామచంద్ర, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు

పైపులైన్‌కు మరమ్మతులు



కల్లూరు, మార్చి 28: పులిచెర్ల మండలం పాళెం పంచాయతీ కొంగరవారిపల్లెకు సరఫరా అవుతున్న తాగు నీటి పైపులైను దెబ్బతినడంతో గురువారం గ్రామ పంచాయతీ మరమ్మతులు చేపట్టింది. పైపులైను 15 రోజుల క్రితం దెబ్బతిని నీరు వృథాగా పోగా తాగునీటికి ఆ గ్రామ ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఈ సమస్యపై బుధవారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో 'వృథాగా పోతున్న తాగునీరు' అనే శీర్షికతో వార్త ప్రచురితమైంది. దీనిపై పంచాయతీ సర్పంచ్ సరస్వతి, కార్యదర్శి రమేష్ స్పందించి దెబ్బతిన్న పైపులైనుకు గురువారం మరమ్మతులు చేయించారు.

మృతుల కుటుంబాలకు సాయం

కుప్పం రూరల్, మార్చి 28: మండలంలోని కంగుంది పంచాయతీ, కొత్తచెరువు తాండాకు చెందిన తెలుగుదేశం కార్యకర్త కమలమ్మ గురువారం అనారోగ్యంతో మృతి చెందారు. అలాగే గణేశ్‌పురం గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త నడేశ్ కూడా మృతి చెందారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీఎస్.మునిరత్నం ఆయా గ్రామాలకు వెళ్లి మృతదేహాలకు నివాళులర్పించారు. మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.10 వేలు సాయం అందించారు.

నేడు టీడీపీ ఆవిర్భావ దినోత్సవం

రామకుప్పం, మార్చి 28: టీడీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని శుక్రవారం రామకుప్పం టీడీపీ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్టు ఆ పార్టీ మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఆనందరెడ్డి, నరసింహులు తెలిపారు. టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు తప్పక హాజరై జయప్రదం చేయాలని వారు కోరారు.

చోరీపై కేసు నమోదు

పుంగనూరు రూరల్, మార్చి 28: ఇటాచీ వాహనంలో రూ. 2లక్షలు విలువ చేసే వస్తువులు చోరీ జరిగినట్లు యాజమాని మురగేశ్‌యాదవ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ సుబ్రహ్మణ్యం తెలిపారు. ఆయన కథనం మేరకు ... పుంగనూరు మండలం మంగళం పంచాయతీ మొరుంపల్లె రైతు విశ్వేశ్వరరెడ్డి పొలంలో ఈనెల 22న పనులు చేస్తూ సాయంత్రం ఇటాచీ వాహనాన్ని అక్కడే వదిలి ఇంటికి వచ్చాడు. 23 తేదీ ఉదయం పొలం వద్దకు వెళ్లి వాహనాన్ని పరిశీలించగా రూ.2 లక్షల విలువ చేసే వస్తువులు చోరీ అయినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కారు ఢీకొని రైతు మృతి

గంగవరం, మార్చి 28 : పలమనేరు- బెంగళూరు రహదారిలోని తిప్పదొడ్డి క్రాస్ వద్ద గురువారం జరిగిన రోడ్డుప్రమాదంలో కృష్ణారెడ్డి అనే రైతు మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు.. బైరెడ్డిపల్లె మండలం బెల్లంమడుగు గ్రామానికి చెందిన కృష్ణారెడ్డి టమోట నారు కొనుగోలు చేయడానికి గంగవరం మండలంలోని తిప్పదొడ్డి గ్రామానికి వెళ్లాడు. టమోటా నార ధరలు కనుగొని ఆటోలో స్వగ్రామానికి వెళ్లడానికి రోడ్డు దాటుతుండగా, బెంగళూరు వైపు నుంచి వస్తున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన కృష్ణారెడ్డిని చికిత్స నిమిత్తం ముళబాగిల్ ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్సపొందుతూ మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గంగవరం అర్బన్ సీఐ చిన్నగోవిందు తెలిపారు.

ఘనంగా మహాభారత ఉత్సవాలు ప్రారంభం


ధర్మరాజుల ఆలయంలో ధ్వజారోహణం నిర్వహించిన అర్చకులు

చిత్తూరు కల్చరల్, మార్చి 28: నగరపాలక పరిధిలోని కుక్కలపల్లె లక్ష్మయ్య కండ్రిగలోని ద్రౌపది సమేత ధర్మరాజుల ఆలయంలో గురువారం ఉదయం ఆలయ అర్చకులు గోపాల అయ్యంగార్ బృందం ధ్వజారోహణంతో మహాభారత ఉత్సవాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త పూల సుబ్రమణ్యం, కుమారస్వామి నాయుడు, సిద్దయ్య నాయుడు, హరిబాబు నాయుడు, రవి నాయుడు, రామచంద్రయ్య, గోవిందయ్య, భక్తులు పాల్గొన్నారు. మహాభారత ఉత్సవాల్లో ప్రతి రోజు మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటలకు వరకు ప్రముఖ కళాకారిణి సీతాలక్ష్మిచే మహాభారతంలోని ఘట్టాల హరికథలు, సాయంత్రం ప్రతి రోజు 9 గంటల నుంచి మరుసటి రోజు ఉదయం 6 గంటలకు వరకు మహాభారత నాటకాలు ప్రదర్శించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ, బీసీలు టీడీపీని గెలిపించాలి

● పూతలపట్టు టీడీపీ అభ్యర్థి మురళీ మోహన్


జయహో బీసీ సభకు హాజరైన టీడీపీ నేతలు

యాదమరి, మార్చి 28: గత ఐదేళ్లుగా వైసీపీ ప్రభుత్వం హిట్లర్ పాలనను సాగించిందని, ఈ పాలనను తరిమికొట్టాలంటే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు బాధ్యతగా తీసుకుని టీడీపీ గెలుపునకు కృషి చేయాలని పూతలపట్టు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి మురళీ మోహన్ పిలుపునిచ్చారు. గురువారం క్లస్టర్-10 పరిధిలోని దళవాయిపల్లెలో జయహో బీసీ కార్యక్రమాన్ని నిర్వహించారు. మురళీ మోహన్ మాట్లాడుతూ టీడీపీ ఆవిర్భావం నుంచి బీసీలకు రాజకీయ ప్రాధాన్యత ఇచ్చిందని చెప్పారు. చిత్తూరు పార్లమెంటు అధ్యక్షులు సీఆర్ రాజన్, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు మాట్లాడుతూ జగన్‌ను మరోసారి నమ్మి మోసపోవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మండల టీడీపీ అధ్యక్షులు మురార్జీ, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్‌రబి, రాష్ట్రకార్యదర్శి సందీప్, జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయాదవ్, గిరిధర్ నాయుడు, దొరబాబు చౌదరి, గాలి దిలీప్ కుమార్, నేతలు హేమగిరి, మాజీ ఎంపీపీ రాజమాణిక్యం, రవి మొదలియార్, చిత్ర, అమరనాథ నాయుడు, గుణశేఖర్, ధరణీప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలో చేరిక..

మండలంలోని పత్రపల్లె మాజీ సర్పంచ్ సురేష్, మాజీ వైస్ సర్పంచ్ సుబ్రహ్మణ్యం, గ్రామస్తులు వరదరాజులు, దనశేఖర్, సతీష్, అజిత్, తదితర 30 కుటుంబాలకు చెందిన వారు గురువారం వైసీపీనుంచి టీడీపీలో చేరారు.

విధానాల్లో మార్పు కోరుకుంటున్న ప్రజలు

- నగరి టీడీపీ అభ్యర్థి గాలి భానుప్రకాష్

నగరి, మార్చి 28: రాష్ట్రంలో వ్యవస్థలు, విధానాల్లో ప్రజలు మార్పును కోరుకుంటున్నారని నగరి టీడీపీ అభ్యర్థి గాలి భానుప్రకాష్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రాబోయే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ ఘనవిజయం సాధిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. వైసీపీ పాలనలో జగన్‌రెడ్డి, ఆయన అనుచరుల అరాచకాలకు పలువురు బలి పశువులయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలు నేడు రాష్ట్రంలో కొనసాగుతున్న అరాచకాలు, అక్రమాలు గమనిస్తున్నారని, ప్రజల్లో నిశబ్ద విప్లవం వస్తోందని ఆయన చెప్పారు. టీడీపీ అధికారంలోకి వస్తే ఉద్యోగస్తులందరికీ సకాలంలో వేతనాలు, పింఛన్‌దారులకు ఒకటో తేదీన పెన్షన్ అందిస్తామన్నారు. టీడీపీ, బీజేపీ, జనసేన కలిసింది వ్యక్తిగత ప్రయోజనాల కోసం కాదని, రాష్ట్రాన్ని దుష్టశక్తుల నుంచి రక్షించడానికేనన్నారు. జగన్ అధికారంలోకి వచ్చాక ఏడుసార్లు విద్యుత్ చార్జీలు పెంచారని, టీడీపీ అధికారంలోకి వస్తే తగ్గిస్తామన్నారు. టీడీపీ ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాలు ప్రజలకు ఎంతగానో ఉపయోగపడతాయని ఆయన వెల్లడించారు. రాష్ట్రాన్ని వైసీపీ అనే రాక్షసుల నుంచి కాపాడటానికే మూడుపార్టీల కూటమి ఏర్పాటు చేసుకున్నట్లు ఆయన తెలిపారు.

వలంటీర్లను కొనసాగిస్తాం: టీడీపీ


ముట్టుకూరుపల్లిలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న గురజాల ప్రతిమ

గుడిపాల, మార్చి 28: టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత వలంటీర్లను కొనసాగించనున్నట్లు టీడీపీ నేత, జీజేఎం ఫౌండేషన్ నిర్వాహకులు గురజాల చెన్నకేశవుల నాయుడు, ప్రతిమ, నాయకుడు సుబ్రమణ్యం నాయుడు పేర్కొన్నారు. గురువారం మండలంలోని వెంగమాంబపురం, 197 రామాపురం, రామభద్రాపురం గ్రామ పంచాయతీల్లో టీడీపీ అభ్యర్థి గురజాల జగన్మోహన్ నాయుడును గెలిపించాలని టీడీపీ నాయకులు ఇంటింటి ప్రచారం చేపట్టారు. నాయకులు మాట్లాడుతూ టీడీపీ అధికారంలోకి రాగానే వలంటీర్లను తొలగిస్తామనే అపోహలు మానాలన్నారు. వలంటీర్లు వారి విధుల్లో యథావిధిగా కొనసాగుతారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు హేమాద్రి నాయుడు, టీడీపీ మండల ఉపాధ్యక్షుడు అనిల్‌కుమార్, సుమతి, దీపశ్రీ, ఉదయ, విక్టోరియా, నాయకులు పళని, ఈశ్వర్ నాయుడు, సాంబశివ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

దుర్గాంబకు రూ.3.82 లక్షల ఆదాయం

చిత్తూరు కల్చరల్, మార్చి 28: గిరింపేట దుర్గాంబ ఆలయంలో గురువారం ఈవో మునిశేఖర్ ఆధ్వర్యంలో హుండీ లెక్కింపు జరిగింది. ఈ సందర్భంగా రూ.3.82 లక్షలు ఆదాయం వచ్చిందని ఈవో తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు దిలీప్‌రెడ్డి, రవికుమార్, వి. లక్ష్మి, నాగవేణి, లావణ్య, గోవర్ధన్, శ్రీకాంత్, అర్చకులు జగదీశ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటి ప్రచారానికి అనుమతి తప్పనిసరి


సమావేశంలో మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి చిన్నయ్య

పూతలపట్టు, మార్చి 28: రాజకీయ నాయకులు చేపడుతున్న ఇంటింటి ప్రచార కార్యక్రమానికి కూడా తప్పనిసరిగా ఎన్నికల అధికారుల అనుమతి తీసుకోవాలని పూతలపట్టు ఎన్నికల రిటర్నింగ్ అధికారి చిన్నయ్య అన్నారు. గురువారం ఆయన తహసీల్దార్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ రాజకీయ నాయకులు ప్రచారాలకు వాడే వాహనాలకు అనుమతి ఉండాలని, డీజే, సౌండ్ సిస్టం తక్కువగా పెట్టుకోవాలన్నారు. ఎన్నికల కోడ్‌ను ఎవరైనా ఉల్లంఘిస్తే ఎంతటి వారినైనా వదిలిపెట్టేది లేదన్నారు. ఎన్నికల సందర్భంగా బంగారుపాళ్యం, యాదమరి మండలాల పరిధిలో చెక్‌పోస్టులను కూడా ఏర్పాటు చేశామన్నారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో నియోజకవర్గ స్థాయి అధికారులతో ఎన్నికలకు సంబంధించి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిధిలోని తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎన్నికల డీటీలు తదితరులు పాల్గొన్నారు.


విజయవాడలో గురువారం టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న చిత్తూరు పార్లమెంటరీ ఎస్సీసెల్ అధ్యక్షుడు పీటర్

కదలి రండి.. ఓటేయండి

● ఇటుక బట్టీల్లో పనిచేసే కూలీలకు అవగాహన


ఓటరు కార్డులను చూపిస్తున్న కూలీలు

చిత్తూరు, మార్చి 28: కదలి రండి.. ఓటు వేయండి.. ప్రతి ఓటు ముఖ్యమైనదే.. అంటూ ఇటుక బట్టీల్లో పనిచేసే కూలీలకు ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. జిల్లా ఎన్నికల అధికారి షన్మోహన్ ఆదేశాల మేరకు స్వీప్ కార్యక్రమాల్లో భాగంగా ఏఆర్వో అరుణ మార్గనిర్దేశంలో నగరపాలక నోడల్ టీము గురువారం నగరపాలక పరిధిలోని సాంబయ్యకండ్రిగ వద్ద ఉన్న ఇటుక బట్టీల్లో పనిచేసే కార్మికులకు ఓటు హక్కు ప్రాధాన్యత, ఈవీఎంల వినియోగంపై అవగాహన కల్పించారు. బట్టీల్లోని ఓటర్లు సార్వత్రిక ఎన్నికల్లో తప్పనిసరిగా ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఈవీఎంలు ఎలా పనిచేస్తాయి..ఓటు వేయడం ఎలా... వేసిన ఓటు సక్రమంగా పడిందా లేదా ఎలా తెలుసుకోవాలో వివరించారు. ఈ కార్యక్రమంలో స్వీప్ నోడల్ అధికారి చిన్నయ్య, టీం సభ్యులు పాల్గొన్నారు.

ఓటుహక్కుతోనే ప్రజాస్వామ్య పరిరక్షణ


ఓటుహక్కుపై ర్యాలీచేస్తున్న మహిళలు

గంగాధరనెల్లూరు, మార్చి 28: ప్రతి ఒక్కరూ ఓటుహక్కును సక్రమంగా వినియోగించుకుంటేనే ప్రజాస్వామ్య పరిరక్షణ సాధ్యమవుతుందని ఐకేపీ ఏపీఎం చిరంజీవి అన్నారు. గంగాధరనెల్లూరులో గురువారం పలువురు మహిళలతో ఫ్లెక్సీలు చేతపట్టి పురవీధుల్లో ఓటుహక్కు గురించి అవగాహన ర్యాలీ నిర్వహించారు.

నింద్ర: స్వీప్ కార్యక్రమంలో భాగంగా గురువారం


ఓటు హక్కు వినియోగంపై ప్రతిజ్ఞ చేస్తున్న మహిళలు

మండల కేంద్రమైన నింద్రలోని ఇందిరాక్రాంతి కార్యాలయంలో మహిళలకు ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించారు. ఓటింగ్ ప్రక్రియ, ఈవీఎంల వినియోగంపై అవగాహక కల్పించారు. ఎంపీడీవో భవాని మాట్లాడుతూ ఓటు హక్కు పవిత్రమైందని, తప్పనిసరిగా వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం చంద్రకళ, సీసీలు ప్రభాకర్, గిరి, నాగేశ్వరరావు సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం దుకాణం తనిఖీ

గుడిపాల, మార్చి 28: మండలంలోని బసవాపల్లి పంచాయతీ రెట్టగుంట గ్రామ సమీపంలో ఉన్న ప్రభుత్వ మద్యం షాపును గురువారం ఎస్‌ఐ శ్రీనివాసరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టాకు నిల్వ తదితర వివరాలపై ఆరాతీశారు.

చర్చిల్లో నేడు గుడ్ ఫ్రైడే

చిత్తూరు కల్చరల్, మార్చి 28: నగరంలోని అన్ని చర్చిల్లో శుక్రవారం గుడ్ ఫ్రైడే(శుభ శుక్రవారం)ను క్రైస్తవులు అత్యంత భక్తి ప్రపత్తులతో నిర్వహించనున్నారు. క్రీస్తు శిలువను ధరించి పాపుల నుంచి ప్రపంచ మానవాళిని రక్షించడాన్ని క్రైస్తవులు గుడ్ ఫ్రైడేగా జరుపుకుంటారు.

వైభవంగా ధ్వజారోహణం


ధ్వజారోహణ కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్ దంపతులు

బంగారుపాళ్యం, మార్చి 28: మండలంలోని మిట్టపల్లిలో వెలసియున్న ధర్మరాజుల ఆలయంలో గురువారం మహాభారత ఉత్సవాల్లో భాగంగా ధ్వజారోహణ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాండవులు, ద్రౌపతి విగ్రహాలను వివిధ పుష్పాలతో అలంకరించి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ ధ్వజారోహణ కార్యక్రమానికి మిట్టపల్లికి చెందిన పురుషోత్తం శెట్టి కుమారుడు సర్పంచ్ రమేష్, రాజేశ్వరి ఉభయదారులుగా వ్యవహరించారు.

కారు ఢీకొని రైతు మృతి

గంగవరం, మార్చి 28 : పలమనేరు- బెంగళూరు రహదారిలోని తిప్పదొడ్డి క్రాస్ వద్ద గురువారం జరిగిన రోడ్డుప్రమాదంలో కృష్ణారెడ్డి అనే రైతు మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు.. బైరెడ్డిపల్లె మండలం బెల్లంమడుగు గ్రామానికి చెందిన కృష్ణారెడ్డి టమోట నారు కొనుగోలు చేయడానికి గంగవరం మండలంలోని తిప్పదొడ్డి గ్రామానికి వెళ్లాడు. టమోటా నార ధరలు కనుగొని ఆటోలో స్వగ్రామానికి వెళ్లడానికి రోడ్డు దాటుతుండగా, బెంగళూరు వైపు నుంచి వస్తున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన కృష్ణారెడ్డిని చికిత్స నిమిత్తం ముళబాగిల్ ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్సపొందుతూ మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గంగవరం అర్బన్ సీఐ చిన్నగోవిందు తెలిపారు.

వైసీపీ స్వార్థానికి 'చార్వాగానిపల్లి' బలి

● పెనుమూరులో మెర్జ్... కోర్టు స్టే ● నిధులు రాక.. అభివృద్ధి జరగక


చార్వాగానిపల్లి సచివాలయం

పెనుమూరు, మార్చి 28: వైఎస్ఆర్‌సీపీ నాయకుల స్వార్థానికి మండలంలోని చార్వాగానిపల్లి పంచాయతీ బలై పోయింది. వివరాల్లోకి వెళితే... పెనుమూరు పంచాయతీ మామూలుగా తెలుగుదేశంపార్టీకి కంచుకోట. గత ఐదు దఫాలుగా జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థులే గెలుపొందారు. మండల కేంద్రంలో వైసీపీ జెండాని ఎలాగైనా ఎగురవేయాలని పెనుమూరుకు ఆనుకుని ఉన్న వైసీపీకి కంచుకోటలాంటి చార్వాగానిపల్లి పంచాయతీని పెనుమూరులో విలీనం చేస్తే కాస్త మెరుగ్గా ఉంటుందని వైసీపీ నాయకులు భావించారు. ఇందుకుగాను 2019లో గుట్టుచప్పుడు కాకుండా ప్రతిపాదనలు సిద్ధం చేసి పంచాయతీరాజ్ శాఖకు ఎంపీడీవో ద్వారా డీపీవోకు పంపించారు. వారు కమిషనరుకు పంపిన అనంతరం మెర్జ్ గెజిట్ వచ్చాక ప్రజలకు తెలిసింది. ఆ తరువాత ప్రజాభిప్రాయ సేకరణకు అధికారులు వస్తున్న రోజు ఎవరికీ తెలియకుండా అరగంట ముందు పంచాయతీలోని అధికారపార్టీ నాయకులకు మాత్రమే విషయం తెలిపి.. వచ్చిన వారి ముందు చార్వాగానిపల్లి పంచాయతీని పెనుమూరులో విలీనం చేయడానికి అభ్యంతరం లేదని తెలిపారు. దీంతో వారు పంచాయతీ మెర్జింగ్ ప్రక్రియను పూర్తి చేసి ప్రొసీడింగ్స్‌ను అన్ని శాఖలకు పంపించారు. ఈ విషయం గురించి తెలుసుకున్న టీడీపీ నాయకులు దీనిపై కోర్టును ఆశ్రయించగా, కోర్టు స్టే విధించింది.

అభివృద్ధి ఊసే లేని చార్వాగానిపల్లి

అసలే చార్వాగానిపల్లి చిన్న పంచాయతీ. నిధులు అంతంత మాత్రమే. దీనిని పెనుమూరు పంచాయతీలో విలీనం చేసిన తరువాత కోర్టు స్టే విధించడంతో అభివృద్ధి పనులు ఏవీ జరగలేదు. వీధి దీపాలు కావాలన్నా సచివాలయానికి వెళ్లి అడిగితే పెనుమూరులో అడగాలని చెబుతున్నారని ప్రజలు వాపోతున్నారు. కనీసం గ్రామాల్లో క్లోరినేషన్ చేసి రెండేళ్ల అయ్యింది. అదేవిధంగా ఉపాధి పనులు లేక కూలీలు, హౌసింగ్ బిల్లులు రాక లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఎన్నికల కోడ్ రావడంతో ఇకపై ఈ పంచాయతీలో వచ్చే సమస్యలను ఎవరు పట్టించుకుంటారో తెలియని పరిస్థితి నెలకొంది.

రూ.80 లక్షల నిధులు వెనక్కు

సర్పంచ్ ఎన్నికలు ఆగిపోవడంతో పెనుమూరు పంచాయతీకి 15వ ఆర్థిక సంఘం నిధులు ఏడాదికి రూ.22 లక్షలు చొప్పున మూడు ఏళ్లకు రూ.66 లక్షలు ఆగిపోయాయి. అలాగే చార్వాగానిపల్లి పంచాయతీకి ఏడాదికి రూ.5 లక్షలు చొప్పున మూడు ఏళ్లకు గాను రూ.15 లక్షలు నిధులు రాలేదు. అసలే ప్రభుత్వం నుంచి నిధులు అంతంత మాత్రమే వస్తున్న నేపథ్యంలో రావాల్సినవి ఆగిపోయాయి. ఈ సమస్యలు ఇంక ఎన్నాళ్లకు పరిష్కారమవుతాయోనని ప్రజలు ఎదురుచూస్తున్నారు.

కూటమి విజయాన్ని ఎవరూ ఆపలేరు


మాట్లాడుతున్న గురజాల జగన్మోహన్, దగ్గుమళ్ల ప్రసాదరావు తదితరులు

చిత్తూరు సిటీ, మార్చి 28: టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీల కూటమి విజయాన్ని ఎవరూ ఆపలేరని చిత్తూరు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్, ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావు అన్నారు. గురువారం జిల్లా టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో 160 ఎమ్మెల్యే సీట్లు ఖచ్చితంగా గెలుస్తామని చెప్పారు. ప్రజలు వ్యవస్థలు, విధానాలు, పరిపాలనలో మార్పులు కోరుకుంటున్నారని అన్నారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినా, ప్రభుత్వ యంత్రాంగం ఈసీ చేతుల్లో ఉన్నా కొంతమంది పోలీసు, మునిసిపల్ అధికారులు వైసీపీకి అనుకూలంగానే పనిచేస్తున్నారని ఆరోపించారు. వైసీపీ పాలనలో ప్రజలు చాలా కష్టాలు పడుతున్నారని పేర్కొన్నారు. జగన్ రెడ్డి రాష్ట్రాన్ని అప్పులపాలు చేశారని, ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు కూడా ఇవ్వలేని పరిస్థితికి తీసుకువచ్చారని విమర్శించారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 7 సార్లు విద్యుత్ చార్జీలు పెంచారని చెప్పారు. టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి ప్రజల క్షేమం కోసమే కాని వ్యక్తిగత ప్రయోజనాలకోసం కాదని చెప్పారు. కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే గత టీడీపీ ప్రభుత్వంలో అమలవుతున్న అన్ని సంక్షేమ పథకాలను తిరిగి ప్రారంభిస్తామన్నారు. టీడీపీ ప్రవేశపెట్టిన మ్యానిఫెస్టో సూపర్ సిక్స్‌కు ప్రజల్లో విశేష స్పందన లభిస్తోందని హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, నేతలు సీఆర్ రాజన్, చంద్రప్రకాష్, కటారి హేమలత, కోదండయాదవ్, త్యాగరాజన్, మోహన్‌రాజ్, సునీల్ కుమార్, జనసేన నేత ఆరణి కవిత తదితరులు పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చని జగన్‌రెడ్డిని ఓడిద్దాం

● తెలుగుమహిళ జిల్లా అధ్యక్షురాలు అరుణ

చిత్తూరు సిటీ, మార్చి 28: ఇచ్చిన హామీలను నెరవేర్చని సీఎం జగన్ రెడ్డి ప్రభుత్వాన్ని ఓడిద్దామని జిల్లా తెలుగుమహిళ అధ్యక్షురాలు కార్జాల అరుణ అన్నారు. గురువారం జిల్లా టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో మద్య నిషేధం అమలు చేసిన తర్వాతే ఓటు అడుగుతానని చెప్పిన సీఎం జగన్ మాట తప్పారని విమర్శించారు. నాసిరకం మద్యం పోసి సుమారు 35 లక్షల మంది ఆరోగ్యాన్ని నాశనం చేశారని, 30 వేల మంది కిడ్నీలు, లివర్లు చెడిపోయి మరణించారని పేర్కొన్నారు. అన్ని రకాల చార్జీలు పెంచి ప్రజల నడ్డి విరిచారని ఆరోపించారు. జగన్ రెడ్డి ఇచ్చిన హామీల్లో 85 శాతం నెరవేర్చలేదని పేర్కొన్నారు. మరలా ఏముఖం పెట్టుకుని ప్రజలను ఓట్లడుగుతారని ప్రశ్నించారు. టీడీపీ అధికారంలోకి వస్తేనే రాష్ట్రం బాగుపడుతుందని ఆమె అన్నారు. కార్యక్రమంలో తెలుగు మహిళలు రాణి, వరలక్ష్మి, శ్రీదుర్గ, లోకమ్మ, భువనమ్మ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు అన్నదానం

గుడిపాల, మార్చి 28: మండలంలోని నిరుపేద ప్రజలకు గురువారం మండల కేంద్రంలో టీడీపీ అధ్యక్షుడు సుబ్రమణ్యం ఆధ్వర్యంలో ముత్తుకూరుపల్లి గ్రామానికి చెందిన సాంబశివ నాయుడు, పవన్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు సుధాకర్, బాలసుబ్రమణ్యం, కిట్టు, గణేష్, కార్యకర్తలు పాల్గొన్నారు.

విలువలతో కూడిన విద్య అవసరం

● సీనియర్ సివిల్ జడ్జి కరుణకుమార్


సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి కరుణకుమార్

చిత్తూరు (సెంట్రల్), మార్చి 28: నేటి ఆధునిక సమాజంలో విలువలతో కూడిన విద్య ఎంతో అవసరమని సీనియర్ సివిల్ జడ్జి కరుణకుమార్ పేర్కొన్నారు. గురువారం స్థానిక ఎస్‌పీ సావిత్రమ్మ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో 42వ వార్షికోత్సవాన్ని ప్రిన్సిపాల్ మనోహర్ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కరుణకుమార్ మాట్లాడుతూ సమాజంలో మహిళల పట్ల గౌరవ మర్యాదలు మరింత పెరగాల్సిన అవసరం ఉందని గుర్తు చేశారు. విద్యతో పాటు తాను ఎంపిక చేసుకున్న రంగాల్లో ప్రతి మహిళా రాణించాలని ఆకాంక్షించారు. మాజీ ఎమ్మెల్యే, గౌరవ అతిథి వెంకటేశ్వరచౌదరి మాట్లాడుతూ ఒక కుటుంబం అభివృద్ధి ఆ కుటుంబంలోని మహిళపై ఆధారపడి ఉంటుందన్నారు. అతిథులు దశరథరెడ్డి, రమాదేవి, అనిత తదితరులు మాట్లాడుతూ ప్రపంచం సాంకేతిక పరంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో మహిళలు అన్ని రంగాల్లోనూ భాగస్వాములు కావాలన్నారు. గతేడాది అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ఎస్‌పీ సావిత్రమ్మ బంగారు పతకాలు అందజేశారు. 25 మంది పేద విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.4 వేలు అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు పలువురిని అలరించాయి. కార్యక్రమంలో అధ్యాపకులు నరేంద్రకుమార్, ఉష తదితరులు పాల్గొన్నారు.

చంపుతానని బెదిరిస్తున్నాడు

● అధికార పార్టీ నేత చిన్నిపై తహసీల్దార్, తాలుకా ఎస్‌ఐలకు బాధితుల ఫిర్యాదు


చిత్తూరు తహసీల్దార్ శ్రీనివాసులు రెడ్డికి చిన్నిపై ఫిర్యాదు చేస్తున్న బాధితులు

చిత్తూరు రూరల్, మార్చి 28: మురకంబట్టులోని ఇందిరమ్మ కాలనీలో ప్రభుత్వం ఇచ్చిన ఇంటి స్థలాలను మురకంబట్టు మాజీ సర్పంచ్ చిన్ని కబ్జా చేసి, చంపుతానని బెదిరిస్తున్నాడని 10 మంది బాధితులు చిత్తూరు తహసీల్దార్ శ్రీనివాసులురెడ్డి, తాలుకా ఎస్‌ఐ ఉమామహేశ్వరిరెడ్డికి గురువారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2021లో ప్రభుత్వం పట్టాలు ఇచ్చిందని, ఇప్పుడు తమ పట్టాల నెంబర్లతో ఫేక్ పట్టాలు తయారు చేసుకొని చిన్ని తమను ఇబ్బందులకు గురిచేస్తున్నాడని ఆరోపించారు. నానా కష్టాలు పడి పునాదులు, గోడల వరకు ఇళ్ల నిర్మించుకుంటే ఇప్పుడు వచ్చి ఆ స్థలం తనదని, వదిలేసి వెళ్లి పోవాలని గూండాలను తీసుకొచ్చి బెదిరిస్తున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు అతడి నుంచి ప్రాణహాని ఉందని, తమకు ప్రభుత్వం కేటాయించిన స్థలంలో ఇళ్ల నిర్మించుకునేందుకు రక్షణ కల్పించాలని వారు కోరారు. చిన్ని, అతడి గూండాలపై కేసు నమోదు చేయాలని వేడుకున్నారు. అదేవిధంగా మురుకంబట్టులోని అపోలో కళాశాల ఆనుకొని ఉన్న తన 15 సెంట్ల భూమిని చిన్ని కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నాడని, జేసీబీలు, గూండాలను తీసుకొచ్చి బెదిరిస్తున్నాడని ఉదయ్ అనే బాధితుడు ఫిర్యాదు చేశారు. బాధితులు సుమతి, కుమార్, నిత్య, మణి, మునస్వామి, శరవణ, వేలు, వెంకటేష్, ప్రకాష్, జయలక్ష్మి, రెడ్డి, విక్టోరియా తదితరులు ఫిర్యాదు చేశారు.

ఎన్నికల నియమావళిని అతిక్రమిస్తే కఠిన చర్యలు: డీఎస్పీ


మాట్లాడుతున్న డీఎస్పీ మూర్తి

విజయపురం, మార్చి 28: ఎన్నికల నియమావళిని అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ మూర్తి హెచ్చరించారు. గురువారం మండలంలోని విజయపురం హరిజనవాడలో గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఎన్నికలు సజావుగా నడవడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ తమ పిల్లలకు మంచి విద్యా బుద్ధులు నేర్పించి, ఉన్నత స్థాయికి ఎదిగేలా తీర్చిదిద్దాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐ సుబ్బరామిరెడ్డి, ఎస్‌ఐ జయప్ప తదితరులు పాల్గొన్నారు.

లారీని వెనుక నుంచి ఢీకొన్న కారు: ఒకరికి గాయాలు


ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు, గాయపడిన మహేష్

తవణంపల్లె, మార్చి 28: లారీని వెనుక నుంచి కారు ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలో గురువారం వేకువజామున చోటుచేసుకుంది. ఎస్‌ఐ కథనం మేరకు వివరాలు. కర్ణాటక రాష్ట్రం బెంగళూరుకు చెందిన మహేష్ తిరుపతి నుంచి బెంగళూరు వెళుతూ మండలంలోని కె.పట్నం సమీపంలో తిరుపతి-బెంగళూరు హైవేపై లారీని వెనుక నుంచి ఢీ కొన్నారు. దీంతో మహేష్‌కు తీవ్రగాయాలయ్యాయి. ఇతడిని చికిత్స నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించి, మెరుగైన చికిత్స నిమిత్తం వేలూరు సీఎంసీకి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

అన్నక్యాంటీన్‌లో అన్నదానం

పూతలపట్టు, మార్చి 28: మండలంలోని అంబేద్కర్ సర్కిల్ వద్ద గల అన్నక్యాంటీన్‌లో గురువారం మద్దిలయ్యగారిపల్లె గ్రామానికి చెందిన టీడీపీ యువనేత దగ్గుపాటి మోహన్ జన్మదినం సందర్భంగా భోజనం వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీనారాయణ, ఏకాంబరం, భాస్కర్, వీరభద్రయ్య తదితరులు పాల్గొన్నారు.


అన్నదానం చేస్తున్న దగ్గుపాటి మోహన్ నాయుడు తదితరులు

నేడు జయహో బీసీ సభలు


బీజేపీ నాయకులను సత్కరిస్తున్న ఎన్‌పీ జయప్రకాష్

బంగారుపాళ్యం, మార్చి 28: మండలంలో శుక్రవారం జయహో బీసీ సభలు నిర్వహిస్తున్నట్లు మండల టీడీపీ అధ్యక్షుడు ఎన్‌పీ జయప్రకాష్ అన్నారు. గురువారం మండల టీడీపీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ శుక్రవారం ఉదయం 9 గంటలకు కీరమందలో, మధ్యాహ్నం 2 గంటలకు కేజీ సత్రంలో, సాయంత్రం 4.30 గంటలకు పెరుమాళ్ళపల్లి గ్రామంలో జయహో బీసీ సభలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమానికి మండలంలోని బీసీలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం బీజేపీ నాయకులు భానుప్రకాష్, రాజేష్, శరత్‌లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎన్‌పీ ధరణీ నాయుడు, కోకా ప్రకాష్ నాయుడు, జనార్దన్ గౌడ్, లోకనాథం నాయుడు, అనిల్, రమేష్, హరిప్రసాద్, గురుమూర్తి పాల్గొన్నారు.

చంద్రబాబు సీఎం కావాలని అన్నదానం

బంగారుపాళ్యం, మార్చి 28: చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని మండల కేంద్రంలోని బీపీఎన్‌కే కాంప్లెక్స్ వద్ద గురువారం టేకుమందకు చెందిన మండల టీడీపీ బీసీసెల్ అధ్యక్షుడు జానకీ రామ్ పేదలకు భోజనం వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు ఎన్‌పీ జయప్రకాష్, నాయకులు ధరణీ నాయుడు, కోకా ప్రకాష్ నాయుడు, కమల్‌నాథ రెడ్డి, జనార్దన్ గౌడ్, శివ, శ్రీనివాసులు, రాజేంద్ర నాయుడు, సుదర్శన్ నాయుడు, రవి తదితరులు పాల్గొన్నారు.